

చేనేత, జౌళిశాఖ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లోతేటి శివశంకర్

రెవెన్యూ రికార్డులు భద్రమేనా?

- వైసీపీ హయాంలో విచ్చలవిడిగా భూకబ్జాలు
- సహకరించిన రెవెన్యూ యంత్రాంగం
- రికార్డులన్నీ ట్యాంపరింగ్
- భూకబ్జాలపై కమిటీ వేస్తామని లోకేశ్ వెల్లడి
- మదనపల్లె ఘటనతో రెవెన్యూ రికార్డులపై అందరి చూపు

జగన్ పాలన ప్రజావేదిక కూల్చివేతతో మొదలు.. ఆ రోజు నుంచి వైసీపీ పాలన ముగిసే వరకు ప్రజాకంటకంగానే సాగింది. వైసీపీ పాలనలో భూకబ్జాలు, ఇసుక మాఫియా గ్రావెల్ ఇలా ఒకటేంటి.. సర్వం సహజ వనరులను దోచేశారు. వాటిలో ముఖ్యమైనది భూములు. వైసీపీ నేతలు వాగులు వంకలే కాదు.. ప్రైవేటు స్థలాలను కూడా అడ్డంగా మింగేశారు. మళ్లీ వచ్చేది వైసీపీ అనే ధైర్యంతో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. రెవెన్యూ రికార్డులను ట్యాంపరింగ్ చేసి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను దోచుకున్నారు. కడప జిల్లాలో జరిగిన భూదందాలపై టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే విచారణ కోసం కమిటీ వేస్తామంటూ పాదయాత్రలో నారాలోకేశ్, ఎన్నికల ప్రచారంలో నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. కూటమి ప్రభుత్వం వచ్చి రెండు నెలలు కాకముందే భూకబ్జారాయుళ్లలో ఆందోళన మొదలైంది. ఈ నేపథ్యంలో అన్నమయ్య జిల్లా మదనపల్లెలో సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని కాల్చివేయడం సంచలనం రేపింది. అన్నమయ్య జిల్లాలో జరిగిన భూ ఆక్రమణల గుట్టును రట్టు చేసేందుకే గతంలో పనిచేసిన రెవెన్యూ అధికారులు, అప్పటి వైసీపీ ప్రజాప్రతినిధులతో కలిసి ఈ ఘాతుకానికి ఒడిగట్టారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కడప జిల్లాలో రెవెన్యూ రికార్డులు భద్రమేనా..? అంటూ చర్చ నడుస్తోంది.



బద్వేలులో జరిగిన భూ ఆక్రమణలకు సంబంధించి నిందితుల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న పత్రాలు, సీళ్లు (ఫైల్‌ఫోటో)



మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో కాలిపోయిన ఫైళ్లు (ఫైల్)

(కడప-ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల హయాంలో జిల్లాలో భారీ స్థాయిలో భూఆక్రమణలు జరిగాయి. కోట్లాది రూపాయల విలువ చేసే స్థలాలను వైసీపీ గ్యాంగ్ అప్పనంగా కొట్టేసింది. మళ్లీ జగనే సీఎం అనే ఉద్దేశ్యంతో రికార్డులను ట్యాంపరింగ్ చేసింది. అయితే ప్రభుత్వం మారడంతో వారి పరిస్థితి తలకిందులయింది. కబ్జాల వ్యవహారం బయటికి వస్తే మా పరిస్థితి ఏందన్న ఆలోచన కొందరు వైసీపీ నేతల్లో ఉంది. కొందరు వైసీపీ వర్గాలు ఇప్పటికే తమ జోలికి రావద్దంటూ టీడీపీ నేతలను శరణు కోరి కొన్నింటిలో సెటిల్ చేసుకున్నారని చెబుతారు.

ప్రైవేటు చేతిలో రెవెన్యూ రికార్డులు

జగన్ పాలన.. అటు ఉమ్మడి రాష్ట్రం, ఇటు నవ్యాంధ్రలో ఓ డిఫరెంట్ స్టైల్. ఆయన కాలంలో రాజ్యాంగ వ్యవస్థలను వాటి పనిచేయనివ్వలేదు. జనం గొంతు నొక్కేశారు. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలు విచ్చలవిడిగా ఆక్రమణకు గురయ్యాయి. వైసీపీ హయాంలో కడప జిల్లాలో సుమారు రూ.10వేల కోట్ల విలువ చేసే ప్రభుత్వ ప్రైవేటు స్థలాలు ఆక్రమించారనే ప్రచారం ఉంది. రెవెన్యూ కార్యాలయాల్లో ఉండాల్సిన రికార్డులు ప్రైవేటు చేతుల్లో ఉన్నాయి. కడప, బద్వేలు, గోపవరం, సీకేదిన్నె, వీఎన్‌పల్లె, పోరుమామిళ్ల, కాశినాయన, కలసపాడు, బి.కోడూరు, మైదుకూరు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, చక్రాయపేట, పులివెందుల, తొండూరు, జమ్మలమడుగు, వేంపల్లె కాశినాయన.. ఇంకా కొన్ని చోట్ల ఉండాల్సిన రెవెన్యూ రికార్డులు అక్కడ కొందరు ప్రైవేటు వారి చేతుల్లో ఉన్నాయంటారు. అక్కడ సర్వే నెంబర్లు రెవెన్యూ సిబ్బందికి ఎంత మాత్రం తెలుసునో కానీ వైసీపీ నేతలకు బాగా తెలుసునంటారు. విలువైన భూములను గుర్తించిన వైసీపీ బ్యాచ్ రికార్డులను ట్యాంపరింగ్ చేసి వాటిని కబ్జా చేసినట్లు విమర్శలున్నాయి. అయితే ప్రభుత్వం మారడంతో భూదందాపై కమిటీ వేస్తే ఇరుక్కుపోతామనే భయం వైసీపీ బ్యాచ్‌లో ఉంది. ఈ నేపధ్యంలో మదనపల్లెలో రికార్డులు కాల్చడంతో కడప జిల్లాలో కూడా రికార్డుల భద్రతపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కడపలో రూ.3వేల కోట్ల ఆస్తి కాజేశారు

కడప నగరం జిల్లాకు హెడ్‌క్వార్టర్. ఇక్కడ సర్వమతాలు ఉన్నప్పటికీ ప్రశాంతతకు నిలయం. ప్రభుత్వ, రిటైర్డ్ ఉద్యోగులు ఉపాధి కోసం ఇతరత్రా వలస వచ్చిన వారు కడపలో స్థిరనివాసం కోసం ఆసక్తి చూపుతున్నారు. అందుకే ఇక్కడ నగర జనాభా గణనీయంగా పెరుగుతోంది. ఇక్కడ నివాస స్థలాలు కూడా పెరిగాయి. అయితే వైసీపీ హయాంలో కడప శివారు ప్రాంతంలోని వాగులు, వంకలు ఇతరత్రా వాటిని కాజేశారు గతంలో పనిచేసిన కడప, సీకేదిన్నె తహసీల్దార్లు వైసీపీ నేతల మోచేతినీళ్లు తాగే విధంగా ప్రవర్తించి సుమారు మూడు వేల కోట్ల రూపాయల విలువ చేసే స్థలాలను అడ్డంగా కట్టబెట్టారంటారు. కడపను ఓ నలుగురు చెరబట్టారు. నగరాన్ని చిన్నచౌకు, సెవెన్‌రోడ్స్, సాయిపేట, ఎర్రముక్కపల్లె, ఆర్టీసీ బస్టాండు, రిమ్స్ రోడ్డు, కలెక్టరేట్.. ఇలా కేక్‌లా పంచుకుని పేదల నోళ్లు కొట్టి వేల కోట్లు ఆర్జించారు. పొద్దున లేస్తే వైసీపీకి చెందిన ఓ నేత సుద్దులు చెబుతారు. చిన్నచౌకులోనే పేదల స్థలాలు కొల్లగొట్టి వాగులు వంకలు ఆయన అనుచరులు ఆక్రమించేసి కోట్లు సంపాదించుకున్నారు. చిన్నచౌకు ఏరియాలో వాగులు వంకలతో ప్రైవేటు స్థలాలను కూడా ఆక్రమించారని చెబుతారు.అయితే చిన్నచౌకు పరిధిలో జరిగిన భూ ఆక్రమణలు, అనుమతి లేని లేఅవుట్ల దందా జోలికి రాకుండా ఉండేందుకు ఎన్నికల టైంలో ఓ వైసీపీ నేత ప్రస్తుత అధికార నేతలతో డీల్ కుదుర్చుకున్నట్లు చెబుతారు. ఎన్నికల ప్రచారంలో టీడీపీ నేతలు కూడా కేవలం కొంతమంది వరకే టార్గెట్ చేసి లోపాయికారీ ఒప్పందంతో ఆయనను వదిలేశారనే ప్రచారం ఉంది. అధికారంలో ఉన్నప్పుడు ఆయన బ్యాచ్ భారీగా భూములు కబ్జా చేశారనే ఆరోపణలున్నాయి. రెవెన్యూ రికార్డులు ట్యాంపరింగ్ చేశారనే విమర్శ ఉంది. ఇక ఓ ముఖ్య నేత ఆయన తమ్ముడు, అల్లుడు కేసీ కెనాల్ భూములు, ఇతర భూములు ఆక్రమించేసి వెంచర్లు వేశారంటారు. సీకేదిన్నెలో పెండ్లిమర్రిలో వీఎన్‌పల్లెలో ముఖ్యనేత బంధువులు భూ ఆక్రమణలకు పాల్పడి రికార్డులు ట్యాంపరింగ్ చేశారంటారు.

కలెక్టర్ సంతకం ఫోర్జరీ చేసి..

పులివెందులలో భూకబ్జాలకు అడ్డే లేకుండా పోయింది. ఈ నియోజకవర్గంలో ఏకంగా అప్పటి కలెక్టర్ సంతకాన్నే ఫోర్జరీ చేసి భూములు కొట్టేశారు. దీనిపై పోలీసు కేసు సైతం నమోదైంది. ఇక బద్వేలు, గోపవరం, పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి.కోడూరు రెవెన్యూ కార్యాలయాల్లో ఉండాల్సిన రికార్డులు వైసీపీ చేతుల్లో ఉన్నాయంటారు. సేమ్ టు సేమ్ రికార్డులను మెయింటెయిన్ చేస్తున్నట్లు చెబుతారు. గోపవరం, బి.కోడూరు, పోరుమామిళ్ల, కాశినాయన, బద్వేలులో రెవెన్యూ రికార్డుల్లో సంతకాలు ఫోర్జరీ చేసి స్థలాలు కబ్జా చేశారు. బద్వేలు, గోపవరంలో జరిగిన భూ అక్రమణలపై గతంలో పనిచేసిన బద్వేలు ఆర్డీఓ వెంకటరమణ స్పెషల్ ఫోకస్ పెట్టారు. కొన్ని సీళ్లు, డాక్యుమెంట్లు స్వాదీనం చేసుకుని కొందరిని అరెస్టు చేసి ఆ కథను అప్పటికి ముగించేశారు. ఆ భూకుంభకోణంలో వందల కోట్ల స్కాం జరగడంతో పాటు ఇందులో వైసీపీకి చెందిన కీలక వ్యక్తులు ఉండడంతో అప్పటి అధికారులు ఆ స్కామ్‌ను ముగించారని చెబుతారు. ప్రొద్దుటూరులో సైతం భారీ స్థాయిలో గోల్‌మాల్ జరిగింది.

జిల్లాలో జరిగిన భూకబ్జాలపై విచారణ జరిపిస్తామని పాదయాత్ర సమయంలో నారా లోకేశ్ హామీ ఇచ్చారు. చంద్రబాబు కూడా ఎన్నికల ప్రచారంలో ఇదే హామీ ఇచ్చారు. టీడీపీ అధికారంలోకి రావడంతో కొందరు వైసీపీ నేతలు తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు టీడీపీలో చేరేందుకు ప్రయత్నిస్తుండగా మరికొందరు రికార్డులను మాయం చేసే యత్నం చేస్తున్నట్లు చెప్పుకొస్తున్నారు. దీంతో రికార్డులు ఇప్పుడు భద్రమేనా అన్న చర్చ నడుస్తోంది.

చేనేత రంగానికి పూర్వవైభవం

- కలెక్టర్ లోతేటి శివశంకర్

కడప (కలెక్టరేట్), జూలై 24: జిల్లాలో చేనేత రంగానికి పూర్వవైభవం తీసుకురావడంతో పాటు.. ప్రపంచ మార్కెట్లో మన చేనేత ఉత్పత్తులకు మంచి గుర్తింపు తీసుకువచ్చేందుకు చర్యలు చేపడతామని కలెక్టర్ లోతేటి శివశంకర్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా చేనేత, జౌళి సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు నాగరాజరావు అధ్యక్షతన జిల్లాలోని మైలవరం మండలంలో టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధి పనుల పురోగతిపై కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేనేత కుటుంబాల ఆర్థిక అభివృద్ధి కోసం చేనేత, జౌళిశాఖ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నాయన్నారు. మగ్గాలనే నమ్ముకుని జీవనోపాధి పొందుతున్న జిల్లాలోని చేనేత వృత్తిదారులను ఆదుకునేందుకు, చేనేత వృత్తిని ప్రోత్సహించడానికి దాదాపు 3వేల మందికి ఉపాధి అవకాశాలు అందేలా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని మైలవరం మండల పరిధిలో టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేస్తోందన్నారు. 2005-06 ఆర్థిక సంవత్సరంలో 68.18 ఎకరాల్లో 118 ప్లాట్లతో ఈ పార్కును అభివృద్ధి చేసేందుకు నాంది పలికారన్నారు. ఇందుకు గాను కేంద్ర ప్రభుత్వం రూ.5.99 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.1.39 కోట్లు కలిపి మొత్తం రూ.7.38 కోట్లను కేటాయించారన్నారు. ఇప్పటి వరకు రూ.3.85 కోట్ల నిధులు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. కాగా ల్యాండ్ డెవలప్‌మెంటు, రోడ్లు, భవనాల నిర్మాణం, క్లినిక్, క్యాంటిన్, పవర్, వాటర్ సప్లై తదితర అభివృద్ధి మౌలిక సదుపాయాల పనులకు రూ.2.78 కోట్లు ఖర్చు చేశారన్నారు. కాగా ఇప్పటికే ఏపీఈడబ్ల్యూఐడీసీ, ఆర్‌డబ్ల్యుఎస్, ఏపీఎస్పీడీసీఎల్ శాఖల ద్వారా సివిల్ వర్క్స్, వాటర్, పవర్ సప్లై పునరుద్ధరణ పనుల కోసం రూ.1.14 కోట్లు వినియోగించుకునేందుకు రాష్ట్ర చేనేత జౌళి శాఖ పరిపాలన అనుమతులు ఇచ్చిందన్నారు. ఈ టెక్స్‌టైల్ పార్కులో యూనిట్ల స్థాపన కోసం ఇప్పటికే 47 మంది దరఖాస్తు చేసుకుని ప్లాట్లు సొంతం చేసుకోగా ఇంకా 75 ప్లాట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇప్పటికే అన్ని రకాల మౌలిక సదుపాయాలు సమకూర్చామన్నారు. వారి ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పించడానికి ప్రభుత్వం సహాయ సహకారాలు అందించనుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌ఎంపీపీ ఐబీసీ, ఏపీఎస్పీడీసీఎల్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇంజనీరింగ్, సంబంధిత శాఖల అధికారులు, జిల్లా చేనేత జౌళిశాఖ అధికారులు, చేనేత యూనిట్లు పెట్టే ఎంటర్ ప్రెన్యూర్‌లు తదితరులు పాల్గొన్నారు.

పాత కలెక్టరేట్‌ను పరిశీలించిన కలెక్టర్

కడప(కలెక్టరేట్), జూలై 24: బ్రిటీష్ కాలం నుంచి దాదాపు రెండు శతాబ్దాలకు పైబడి కడప జిల్లా ప్రజలకు పరిపాలన అందించిన పాత కలెక్టరేట్ భవనాలను కలెక్టర్ లోతేటి శివశంకర్ బుధవారం పరిశీలించా రు. గతంలో ఇక్కడున్న కలెక్టర్ చాంబరును, వీడియో కాన్ఫరెన్స్ హాలును, బ్రిటీష్ కాలం నాటి నిర్మాణాలను, జిల్లా ఖజానా శాఖ భద్రతా గోడౌన్‌ను పరిశీలించారు. కాగా 12 ఏళ్ల కిందట రిమ్స్‌కు వెళ్లే మార్గంలో కొత్త కలెక్టరేట్ భవన సముదాయాలు నిర్మించడంతో కలెక్టరేట్ అక్కడికి తరలిపోయింది. నాటి నుంచి చారిత్రాత్మకమైన పాత కలెక్టరేట్ భవనాన్ని పట్టించుకునేవారు లేక శిధిలావస్థకు చేరుకుంది. ఈ పదేళ్లలో ఐదుగురు కలెక్టర్లు జిల్లాలో పనిచేశారు. కానీ పాత కలెక్టరేట్ మరమ్మతులపై దృష్టి సారించలేదు. వైసీపీ ప్రభుత్వంలో ఏకంగా ఇక్కడ చెత్త బండ్లు పెట్టడం ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే పాత కలెక్టరేట్‌లో మరమత్తు పనులు కూడా ప్రారంభం కావడం శుభ పరిణామం. పాత కలెక్టరేట్‌లో యువత నైపుణ్య శిక్షణా కేంద్రం, లేదా మ్యూజియం, లక్షలాది రూపాయలు నెలకు బాడుగులు చెల్లిస్తూ ప్రైవేటు భవనాల్లో ఉన్న జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తే పాత కలెక్టరేట్‌కు పూర్వ వైభవం వస్తుందని నగర ప్రజలు ఆశిస్తున్నారు.

అనాథలా.. పశువైద్య కళాశాల

ప్రొద్దుటూరు పశువైద్యకళాశాల గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా మారింది. కళాశాల నిర్వహణ దగ్గర నుంచి అధ్యాపకుల జీతాల వరకు అంతా నిర్లక్ష్యంగానే సాగింది. పశువైద్యకళాశాలలో ఉన్నపశువులకు దాణా కూడా కొనలేని దుస్థితి నెలకొంది. ప్రతి ఏడాది కళాశాల నిర్వహణకు అయ్యే ఖర్చులో కనీసం పదిశాతం కూడా ప్రభుత్వం నిధులు విదిల్చకపోవడంతో.. కళాశాల నిర్వహణే ప్రశ్నార్థకంగా మారింది. కొత్త ప్రభుత్వమైనా కళాశాలకు నిధులు సమకూర్చి ఆదుకుంటుందని అధ్యాపకులు, సిబ్బంది వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు.

- ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం
- కళాశాల నిర్వహణకు నిధులు ఇవ్వని వైనం
- పేరుకుపోయిన విద్యుత్, దాణా బిల్లులు
- మూడు నెలలకు ఒకమారు జీతాలు

(కడప-ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులోని పశువైద్య కళాలలో విద్యార్థుల ప్రాక్టికల్స్, పీజీ విద్యార్థుల పరిశోధనకు ఇక్కడ ఆవులు, గేదెలు, కోళ్లు, పందులు, గొర్రెలు పెంచుతున్నారు. విద్యార్థుల చదువుకోసం ఈ ఫారమ్ ఎంతగానో అవసరం. ఇందులో పశువులు, కోళ్ల దాణా, మందులు ఇతరత్రా అవసరాల కోసం ప్రతి సంవత్సరం ప్రభుత్వం రూ.60 లక్షలు ఇచ్చేది. అయితే వైసీపీ అధికారం చేపట్టిన ఐదేళ్లలో ఈ నిధులు చెల్లించలేదు. ప్రభుత్వం దాణాకు నిధులు ఇవ్వకపోవడంతో నంద్యాలకు చెందిన మార్క్‌ఫెడ్ దాణా కేంద్రం నుంచి దాదాపు రూ.40లక్షలమేర దాణా కొనుగోలు చేశారు. ఈ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే తాగు నీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన బోరు కరెంటు బిల్లులు, కళాశాల కరెంటు బిల్లులు దాదాపు రూ.30లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక రెగ్యులర్, కాంట్రాక్టు ఉద్యోగుల జీతాలు ప్రతినెలా చెల్లించలేదు. రెండు, మూడు నెలలకు చెల్లిస్తూ వచ్చారు. కళాశాల అధ్యాపకుల దౌర్భాగ్యం ఏమిటంటే.. సెక్రటేరియట్‌లో ముడుపులు ఇస్తేనే.. తమకు జీతాలు పడేవని ఓ ఉద్యోగి వాపోయారు.

రూ.6లక్షల నుంచి రూ.50వేలకు కుదింపు

ప్రొద్దుటూరులో జిల్లాస్థాయి పశువైద్యశాల ఉండడంతో జిల్లా నలుమూలల నుంచి వచ్చే గేదెలు, ఆవులతోపాటు పెంపుడు జంతువులకు అత్యాధునిక వైద్యసేవలు, శస్త్రచికిత్సలు ఇక్కడ జరుగుతుండేవి. ఈ వైద్యశాలకు మందుల కోసం 2019 ముందు వరకు సంవత్సరానికి రూ.5లక్షల నుంచి రూ.6లక్షలు ఇచ్చేవారు. దీంతో మందులు కొనడంతో పాటు, వైద్యశాలలోని అల్ట్రాసౌండ్, ఎక్స్‌రే యంత్రాలు, ఇతర సామగ్రి మరమ్మతులు చేయించుకునేవారు. వైసీపీ కొలువుదీరిన 2019 తర్వాత ఆ బడ్జెట్ రూ.50 వేలకు కుదించారు. ఆ రూ.50వేలు వైద్యశాలలో దూది, సర్జికల్ స్పిరిట్ కొనడానికి మాత్రమే సరిపోతుంది.

వైసీపీ ప్రభుత్వ వచ్చాక..

ప్రొద్దుటూరులోని పశువైద్య కళాశాల నిర్వహనకు ఏటా రూ.60లక్షలు ఇవ్వాల్సి ఉండగా.. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. కళాశాలకు నీళ్ల సరఫరా కోసం చెన్నమరాజుపల్లె ఏటి వద్ద రెండు బోర్లు వేసి వాటి నుంచి నీటిని సరఫరా చేసేవారు. 2014-19 వరకు అక్కడ ఫీడర్‌కు 18గంటలు కరెంటు ఇచ్చేవారు. 2019 తర్వాత ఆ సమయం 12 గంటలకు తగ్గించడంతో 500 మంది విద్యార్థులు, 200 మంది ఉద్యోగులకు, 300 పశువులకు మాత్రమే ఆ నీళ్ల సరిపోతున్నాయి. పశువుల గడ్డి పెంపకానికి కావాల్సిన నీటి సరఫరా ఆగిపోయింది. దీంతో పశుగ్రాసం పెంపకం కూడా పూర్తిగా నిలిపివేశారు. కళాశాలకు సంబంధించిన రూ.30లక్షల కరెంటు బిల్లులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. అంతేకాకుండా కళాశాలకు మొత్తం 138 మంది బోధన సిబ్బంది పోస్టులు ఉండగా.. 39 మంది ప్రొఫెసర్లు మాత్రమే ఉన్నారు. ఇందులో 20 మంది రెగ్యులర్, 15 మంది కాంట్రాక్టు, నలుగురు డిప్యుటేషన్‌లో ఉన్నారు. ప్రొద్దుటూరు పశువైద్య కళాశాలను పశువైద్య విశ్వవిద్యాలయం చేయాల్సి ఉంది. కళాశాలగా మాత్రమే కొనసాగుతున్న కారణంగా కరువుభత్యం నిధులు, అరియర్స్ బిల్లులు ట్రెజరీకి సమర్పించినపుడు వాటిని తిరస్కరిస్తున్నట్లు సమాచారం.



ప్రొద్దుటూరులోని పశువైద్యకళాశాల

ఒంగోలు ట్రిపుల్‌ఐటీకి అడ్మిషన్లు ప్రారంభం

వేంపల్లె, జూలై 24: ఒంగోలు ట్రిపుల్ ఐటీలో ఆరు సంవత్సరాల సమీకృత ఇంజనీరింగ్ కోర్సులో చేరేందుకు అడ్మిషన్ కౌన్సెలింగ్‌ను వేంపల్లె మండలం ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో బుధవారం నిర్వహించారు. ఒంగోలు ట్రిపుల్‌ఐటీలో టాపర్‌గా నిలిచిన పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం మండలం తరిబల్లి గ్రామానికి చెందిన ఎం.మేఘనకు ఆర్జీయూకేటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ మొదటి అడ్మిషన్ ఫైల్‌ను అందించారు. 586మంది విద్యార్థులకు కాల్‌లెటర్లు పంపగా 456 మంది అడ్మిషన్ పొందినట్లు కౌన్సెలింగ్ కన్వీనర్ అమరేంద్ర కుమార్ తెలిపారు. అడ్మిషన్ పొందిన అందరు విద్యార్థులకు తరగతి గదులు, హాస్టల్ గదులను కేటాయించారు. అనంతరం విలేకరులతో వీసీ మాట్లాడుతూ.. ట్రిపుల్‌ఐటీల్లో అధ్యాపకుల కొరత ఉందన్నారు. రెగ్యులర్ పోస్టుల నియామకం కోసం నోటిఫికేషన్ ఇచ్చామని, పలువురు దరఖాస్తు చేసుకున్నారని అయితే దీనిపై కొందరు కోర్టులో కేసులు వేయడంతో ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం తీసుకునే నిర్ణయం మేరకు ముందుకెళ్తామన్నారు. ప్రస్తుతం ఉన్న ఫ్యాకల్టీతోనే మెరుగైన విద్యాబోధన అందిస్తున్నామని వీసీ తెలిపారు.

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తా : జేసీ అదితి సింగ్



నూతన జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అదితి సింగ్

కడప(కలెక్టరేట్), జూలై 24: రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా, కలెక్టర్, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారుల సమన్వయ సహకారంతో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథకంలో నడిపించేందుకు కృషి చేస్తానని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం కలెక్టరేట్‌కు చేరుకున్న తన చాంబరులో నూతన జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కర్తవ్య నిబద్ధతతో ఉద్యోగ ధర్మాన్ని నెరవేరుస్తూ జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందేలా కృషి చేస్తానన్నారు. తాను 2020 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారినని, తిరుపతి మున్సిపల్ కమిషనరుగా 6నెలలు పనిచేశానన్నారు. అంతకు ముందు విశాఖపట్నంలో శిక్షణ పొంది విజయవాడ సబ్ డివిజన్‌లో సబ్ కలెక్టర్‌గా దాదాపు 14 నెలలు పనిచేశానన్నారు. ప్రస్తుతం జాయింట్ కలెక్టర్‌గా కడప జిల్లాకు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అంతకు ముందు కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆమె కలెక్టర్ లోతేటి శివశంకర్‌ను మర్యాదపూర్వకంగా కలసి పూల మొక్కను అందించారు. అనంతరం డీఆర్వో గంగాధర్ గౌడ్, ఆర్డీఓలు వెంకటేశ్, చంద్రమోహన్, ఐఅండ్ పీఆర్ వేణుగోపాలరెడ్డి, కలెక్టరేట్ పరిపాలనాధికారి విజయ కుమార్, జీఎస్ఎస్ఎస్ స్పెషల్ కలెక్టర్ కౌసరు బాను పలువురు జిల్లా అధికారులు పుష్ప గుచ్ఛాలతో ఆమెకు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

రిమ్స్‌లో నిఫా వైరస్ ప్రత్యేక వార్డు

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 24: దేశంలో కొంతకాలంగా చాపకింద నీరులా వ్యాపిస్తున్న నిఫా వైరస్ కోవిడ్‌లాగా ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో నిఫా వైరస్‌ను ఎదుర్కొనేందుకు పది ప్రత్యేక బెడ్లతో పూర్తిస్థాయి బయో మెడికల్ ఎక్విప్‌మెంట్లతో పదిరూములను బుధవారం సిద్ధం చేశారు. ఈ సందర్భంగా సర్వజన ఆసుపత్రి సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ముందస్తు చర్యల్లో భాగంగా నోడల్ ఆఫీసర్ యాదవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్‌లు సునీల్, నూకరాజు, నాగశ్రీలత సభ్యులుగా ఈ నిఫా వైరస్‌కు సంబంధించి ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశామన్నారు. పూర్తిస్థాయి మందులతో షిఫ్టుకు ఇద్దరు చొప్పున డాక్టర్లతో మొత్తం ఆరుగురు వైద్యులు, నర్సులు ఎంఎన్‌వో, ఎఫ్‌ఎన్‌వోలు ఇద్దరు సీఎస్‌ఆర్‌ఎంవోలు, ఇద్దరు డిప్యూటీ సీఎస్ ఆర్‌ఎంవోలు, ఇద్దరు హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్లు, ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ నర్సులు నలుగురు, రెగ్యులర్ నర్సులతో ఈ నిఫా వైరస్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



నిఫా వైరస్ ప్రత్యేక వార్డును ప్రారంభిస్తున్న ఆర్‌ఎంఓ, వైద్యసిబ్బంది

మూడోరోజు కొనసాగిన విచారణ

- ఆరుగురిని విచారించిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ, కలెక్టర్
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్



విచారణ అనంతరం సబ్ కలెక్టరేట్ నుంచి బయటకు వస్తున్న ఉద్యోగులు

మదనపల్లె టౌన్, జూలై 24: మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో కీలకమైన ఫైళ్ల దహనం ఘటనపై మూడోరోజు బుధవారం కూడా రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారులు విచారణ కొనసాగించారు. రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా, కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆధ్వర్యంలో పూర్వపు ఆర్డీవోలు మురళి, హరిప్రసాద్‌ను విచారించారు. వీరితో పాటు సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ, భరత్‌రెడ్డి, వీఆర్‌ఏ రమణయ్యలను మరోమారు విచారించారు. అలాగే ఈ కేసులో అనుమానితుడిగా ఉన్న రైస్ మిల్లు మాధవరెడ్డి, అతడి కుమారుడు మౌనిష్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సతీమణి స్వర్ణలత తదితరుల పేరు మీద ఏయే భూములు రిజిస్ట్రేషన్ అయ్యాయి అనే వివరాలను మదనపల్లె ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ రాజును పిలిపించి ప్రశ్నించారు. దీంతో పాటు సంఘటనా స్థలంలో కాలిపోయి మిగిలిన ఫైళ్లను, కంప్యూటర్ హార్డ్ డిస్కులను, సీపీయూలను, 30 మంది వీఆర్‌వోల సమక్షంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకు పంచనామా రాసి స్వాధీనం చేసుకున్నారు. డివిజన్‌లోని 11 మండలాల తహసీల్దార్ కార్యాలయాల నుంచి తీసుకొచ్చిన ఫైళ్ల వివరాలను కూడా నమోదు చేసి భద్రపరిచారు.

సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న 20 మందికి పైగా ఉద్యోగుల మొబైల్ ఫోన్లను పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో వీరి మొబైల్ ఫోన్ల నుంచి ఘటన జరిగిన ముందు రోజు, సోమవారం ఎవరెవరికి కాల్స్ వెళ్లాయో, ఎంత సమయం మాట్లాడారో పోలీసు టెక్నికల్ బృందాలు కాల్ డేటా తీస్తున్నారు. బుధవారం విధులకు వచ్చిన ఉద్యోగులను సీఐడీ, పోలీసులు, రెవెన్యూ అధికారులు వేర్వేరుగా విచారించారు. సాయంత్రం 5 గంటలపైన ఉద్యోగులు ఇళ్లకు తిరిగి వెళ్లారు. కానీ వారి నుంచి స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లను పోలీసులు అప్పగించలేదని తెలిసింది.

మంటలు రావడానికి కారణాలపై విశ్లేషణ

మదపపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కీలక ఫైళ్ల దహనం ఘటనలో అగ్గి రాజుకోవడానికి, వేగంగా ఇతర సెక్షన్‌లకు విస్తరించడానికి గల కారణాలను రాష్ట్ర ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ పి.వెంకటరమణ విశ్లేషిస్తున్నారు. ఘటనా స్థలాన్ని రెవెన్యూ చీఫ్ సెక్రటరీ సిసోడియాతో కలసి వెంకటరమణ పరిశీలించారు. మదనపల్లె ఫైర్ సర్వీసు అధికారికి ఎప్పుడు ఫోన్ సమాచారం వచ్చింది, ఎంత సమయానికి సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు, ఎంత సేపటిలో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.. తదితర వివరాలను డైరెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

మదనపల్లె చేరుకోనున్న సీఐడీ చీఫ్

సీఐడీ పోలీసులు రెండురోజుల పాటు కొనసాగించిన దర్యాప్తు, అనుమానితుల విచారణ, సేకరించిన సాక్ష్యాలు, ఎఫ్ఎస్ఎల్ శాంపిల్స్ పరిక్షించిన రిపోర్టులు తదితర విషయాలను సమగ్రంగా విచారించడానికి సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ బుధవారం రాత్రి మదనపల్లె చేరుకోనున్నారు. వీటిపై గురువారం పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

నిర్లక్ష్యం వహించిన పోలీసులపై వేటు

మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దహనం ఘటనపై విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు పోలీసులపై ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు వేటు వేశారు. సంఘటన జరిగిన ప్రాంతానికి వెళ్లిన వన్‌టౌన్ సీఐ వల్లీబషు ఈ సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలపలేదు. ఆ సమయానికి అదే ప్రాంతంలో బీట్ నిర్వహించిన ఇద్దరు కానిస్టేబుళ్లు కూడా ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వలేదు. దీనిపై సీరియస్ అయిన ఎస్పీ వన్‌టౌన్ సీఐ వల్లీబషును వీఆర్‌కు బదిలీ చేయగా, బీట్ కానిస్టేబుళ్ల హరిప్రసాద్, భాస్కరయ్యను సస్పెండ్ చేశారు. వీఆర్‌లో ఉన్న బి.ప్రసాద్‌ను వన్‌టౌన్ సీఐగా నియమిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.



కిటికీ పక్కన పడిన కాలిన అవశేషాలను పరిశీలిస్తున్న ఫైర్ సర్వీస్ డైరెక్టర్ వెంకటరమణ

పశువులు చనిపోతున్నా... పట్టించుకోరా?

● వైద్యులు సక్రమంగా రారు.. వైద్యానికి మందులు ఉండవు.. వ్యాక్సినేషన్‌లో జిల్లా వెనుకబాటు ● పశుసంవర్ధకశాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై రైతుల ఆగ్రహం.. ఆందోళన





జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో ప్లకార్డులు చేతపట్టి నినదిస్తున్న రైతులు, సమస్యలపై అధికారులను నిలదీస్తున్న రైతులు

కడప(రూరల్) జూలై 24: జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై బుధవారం రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. బుధవారం కడప నగరం కోటిరెడ్డి సర్కిల్‌లోని జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ప్లకార్డులు చేతపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఒంగోలు, పుంగనూరు గో జాతి అభివృద్ధి జిల్లా కన్వీనర్ సి.కిరణ్‌కుమార్‌రెడ్డి, కో-కన్వీనర్ పుత్తా వెంకటసుబ్బారెడ్డి (మాజీ కార్పొరేటర్) ఒంగోలు జాతి పశుపోషకులు వి.విశ్వనాధరెడ్డి (పొలతల మాజీ చైర్మన్), జి.వెంకటస్వామి, ఆర్.రాజశేఖర్‌రెడ్డి తదితరుల అధ్వర్యంలో పెద్ద సంఖ్యలో రైతులు జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయానికి చేరుకున్నారు. ఉదయం 11-30 గంటల ప్రాంతంలో జేడీ శారదమ్మ, పలువురు డీడీలు, ఏడీలతో సమస్యలపై ఏకరువుపెట్టారు. ప్లకార్డులు చేతపట్టి అధికారుల నిర్లక్ష్యపు చర్యలను ఎండగట్టారు. జిల్లాలోని పలు పశువైద్యశాలల్లో డాక్టర్లు అందుబాటులో ఉండడం లేదని మండిపడ్డారు. పైగా ప్రతి వైద్యానికి మందులు లేవని దాటవేస్తున్నారని.. దీంతో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు తదితర పశువులు మృత్యువాత పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

జిల్లాలో పశువులకు రక్షణ పూర్తిగా కొరవడిందన్నారు. వ్యాధినిరోధక టీకాలు, పశువుల గర్భదారణ విషయంలో, డాక్టర్ల సర్వీసు విషయంలో జిల్లా చాలా వెనుకబడి ఉందన్నారు. ఈ కారణంగా పశుపోషకులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. గతప్రభుత్వంలో రూ.30 కోట్లు వెచ్చించి వ్యాక్సినేషన్ నిల్వల కోసం ఫ్రిజ్జులు కొనుగోలు చేశారని... ఇందులో పెద్ద అవినీతి జరిగిందన్నారు. ఇక సరైన సమయంలో వైద్యులు స్పందించక రూ.లక్షలు విలువ చేసే గిత్తలు ఉన్నపలంగా చనిపోతున్నాయని.. వీటికి బీమా సౌకర్యం లేక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. గిత్తలకు రూ.5లక్షల వరకు బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

జిల్లాలోని పశుగణాభివృద్ధి కమిటీలో ఉన్న సభ్యులకు ఎవరికీ పశువులు లేకున్నా.. బైలాకు విరుద్ధంగా కమిటీ సభ్యులుగా నియమించడం చట్టవిరుద్ధమన్నారు. ఈ కమిటీవలన పశుపోషణకు తీవ్ర నష్టం కలుగుతోందన్నారు. వెంటనే వారిపై విచారణ జరిపించి కమిటీని రద్దుపరచాలన్నారు. గిత్తల పెడిగ్రీ లేకుండా ఏపీఎల్‌డీఏ నాణ్యతలేని గిత్తల సెమెన్ సరఫరా చేస్తున్నారని ఇది పెద్ద దగా అన్నారు. పాడిపశువులకు ఎన్నిసార్లు సెమెన్ వేసినా చూడి కట్టక వధశాలకు వెళ్తున్నాయన్నారు. ప్రతి హాస్పిటల్‌లో డాక్టర్లు సమయపాలన పాటించడం లేదన్నారు. మందుల కొరత వేధిస్తోందన్నారు. వ్యాక్సినేషన్‌ను సరైన సమయంలో వేయకపోవడం వలన వందలాది పశువులు మరణిస్తున్నాయన్నారు. రైతుల వాదనలను అధికారులు తేలిగ్గా తీసుకోవడంతో అర్ధాంతరంగా చర్చను ముగించి తదుపరి ఉద్యమ కార్యాచరణను వెల్లడిస్తామని వెళ్లిపోయారు. కాగా, అంతకు ముందు కడప ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పశుసంవర్ధకశాఖలో సాగిన అవినీతి బాగోతంపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పై ఆరోపణలలో ఎలాంటి వాస్తవం లేదని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి శారదమ్మ తెలిపారు. వ్యాక్సినేషన్స్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వస్తుంటాయని.. వచ్చిన వాటిని ఆయా కాలాల్లో ప్రాధాన్యతా క్రమంగా వేస్తున్నామన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు తగు చర్యలు చేపడుతున్నామన్నారు. పశువులకు దాణా, పిల్లపెసర, ఉలవలు సబ్సిడీపైన అందించాలని రైతులు కోరగా.. పై అధికారులకు, ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు డీడీలు, ఏడీలు తదితరులు పాల్గొన్నారు.

అన్నక్యాంటిన్ ఏర్పాటుపై స్థల పరిశీలన



జడ్పీ ఆవరణలోని అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ రత్నాల రావు

కడప(రూరల్) జూలై 24: రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు శ్రీకారం చుటారు. ఈ మేరకు ఆగస్టు 15 నాటికి క్యాంటీన్లను ఏర్పాటు చేసేందుకు కడప కార్పొరేషన్ అధికారులు తగు చర్యలను వేగవంతం చేశారు. గత 2014-19 టీడీపీ పాలనలో జిల్లా ప్రజాపరిషత్తు కార్యాలయం స్థలంలోని మెయిన్ రోడ్డులో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసి పేదలకు భోజనం అందించారు. తరువాత వైసీపీ ప్రభుత్వం రావడంతో దాన్ని మూసివేశారు. తిరిగి యథాస్థానంలో అన్న క్యాంటీన్‌ను కొనసాగించడానికి బుధవారం కడప నగరపాలక సంస్థ ఎస్ఈ రత్నాలరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు కడప నగరంలోని మూడు ప్రాంతాలలో అన్న క్యాంటీన్లు ఏర్పటు చేయడానికి భవనాలు అనువుగా ఉన్నాయన్నారు. ఇందులో జడ్పీ ఆవరణలోని స్థలం ఒకటన్నారు. ఇక్కడ త్వరలోనే అన్న క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు అరికట్టాలి



ఏఎస్పీ సుధాకర్‌ను కలిసి వినతిపత్రం అందిస్తున్న జిల్లా విద్యుత్‌శాఖాధికారి రమణ

కడప (నాగరాజుపేట), జూలై 24: జిల్లాలో జరుగుతున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలను అరికట్టాలని జిల్లా విద్యుత్‌శాఖాధికారి రమణ కోరారు. ఈ మేరకు జిల్లా అడిషనల్ సూపరింటెం డెంట్ ఆఫ్ పోలీసు (ఏఎస్పీ) సుధాకర్‌ను ఆయన ఆఫీసులో బుధవారం కలిసి అధికార లేఖను అందించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ దొంగలు ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి వాటిలోని కాపర్ వైరును చోరీ చేస్తున్నారన్నారు. దీంతో రైతులు సాగు చేస్తున్న పంటలకు, సంస్థకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని.. వీటిని అరికట్టాలని కోరారు.

పుష్పగిరి క్షేత్రంలో పురావస్తు అధికారులు



ఆలయ పరిధిలో పరిశీలిస్తున్న పురావస్తు శాఖ అధికారులు

వల్లూరు, జూలై 24: పుష్పగిరి క్షేత్రాన్ని బుధవారం కేంద్ర పురావస్తుశాఖ అసిస్టెంటు ఇంజనీరు భాను ప్రకాశ్‌శర్మ స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. ముందుగా కొండపైన చెన్నకేశవ స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో కలియ దిరిగి దెబ్బతిన్న గోపురాలను పరిశీలించారు. మరమ్మత్తులు చేసేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా కొండపైన భక్తులకు ఇబ్బందులు లేకుండా మరుగుదొడ్ల నిర్మించేందుకు ప్రయత్నిస్తామన్నారు. వీరి వెంట జిల్లా సీఏ బాలక్రిష్ణారెడ్డి, సర్వేయరు ఫణీంద్ర, పురావస్తుశాఖ సిబ్బంది, స్థానిక పూజారులు పాల్గొన్నారు.

కోల్డ్ స్టోరేజ్ పనులను నిలుపుదల చేయకపోతే
29 నుంచి పసుపు కొనుగోళ్లు నిలిపివేత

కడప(రూరల్) జూలై 24 : కడప పసుపు మార్కెట్ యార్డు పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా పండ్ల వ్యాపారాన్ని సాగించేందుకు ఏర్పాటు చేస్తున్న పనులను తక్షణమే నిలుపుదల చేయించకపోతే జూలై 29 నుంచి మార్కెట్‌యార్డులో పసుపు కొనుగోళ్లను నిలిపివేస్తామని కడప పసుపు వ్యాపారుల సంఘం అధ్యక్షుడు ఎం. రామక్రిష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు తమ న్యాయమైన డిమాండ్‌ను కలెక్టర్‌కు, మార్కెట్‌యార్డు జేడీకి, సెక్రటరీకి, కడప ఎమ్మెల్యేకి తెలియజేశామన్నారు. పసుపు మార్కెట్ యార్డులో చట్టాల ఉల్లంఘన జరుగుతోందన్నారు. పసుపు మార్కెట్‌లోని గది నెంబర్ 16/329లో పసుపు, వేరుశనగ వ్యాపారం మాత్రమే కొనసాగించాలన్నారు. అలా కాకుండా ఒక వ్యక్తి పండ్ల వ్యాపారాన్ని నడుపుతున్నారని.. అందులో ఏసీని ఏర్పాటు చేశారన్నారు. గతంలో సెక్రటరీకి, జెడీని సంప్రదించినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా ఈ విషయంలో పరిష్కారం చూపకపోతే జూన్ 29 నుంచి వ్యాపారాన్ని నిలిపివేయాల్సి వస్తుందన్నారు. అలాగే పసుపు మార్కెట్ యార్డులో ఒక షెడ్ నిర్మాణంలో ఉందని 4 సంవత్సరాల నుంచి ఇప్పటి వరకు పూర్తి కాలేదన్నారు. మార్కెట్ నిర్వహణ అధ్వానంగా ఉందని.. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



చంద్రశేఖర్ మృతదేహం

పోరుమామిళ్ల, జూలై 24: రంగసముద్రం పంచాయతీ పరిధిలోని జగనన్నకాలనీకి సమీపంలో ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని చంద్రశేఖర్ (35) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం ఆ పరిసర ప్రాంతాల్లో బిందెల వ్యాపారం చేసుకుంటున్న యువకులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ తిమోతి సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి.. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ వివరాల మేరకు.. కర్నూలు జిల్లా ఆత్మకూరుకు చెందిన చంద్రశేఖర్ పోరుమామిళ్లలోని బలిజకోట వీధిలో పందుల వ్యాపారం చేసుకుంటున్న సరస్వతిని కొన్ని సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు ఒక కుమార్తె సంతానం. చంద్రశేఖర్ కొంత కాలం భార్యతో కలిసి ఉన్నాడని, గత రెండు మూడేళ్ల నుంచి ఇంటికి వెళ్లకుండా కర్నూలు జిల్లాలోని ఆత్మకూరులో బేల్దారి పనులు చేసుకుంటుండేవాడు. ఇటీవల పోరుమామిళ్లకు వచ్చినా ఇంటికి సరిగా వెళ్లేవాడు కాదు. మద్యానికి బానిసై మతిస్థిమితం కోల్పోయి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

59 దుంగలు స్వాధీనం...నలుగురు అరెస్టు



ఎర్రచందనం దుంగలు, పట్టుబడిన నిందితులు

గోపవరం, జూలై 24: అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 59 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని.. నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి స్థానిక రూరల్ పోలీసుస్టేషన్‌లో బుధవారం మైదుకూరు డీఎస్పీ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. నెల్లూరు-బద్వేలు ప్రధాన రహదారిలో పీపీకుంట వద్ద రేగిమానువంకకు సమీపంలో దుంగలను తరలించేందుకు సిద్దంగా ఉన్న సమయంలో తమ సిబ్బంది దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. నిందితుల వద్ద నుంచి 59 దుంగలతో పాటు టాటాఏస్ వాహనం, రెండు మోటరు సైకిళ్లను సీజ్ చేశామన్నారు. నెల్లూరు జిల్లా మర్రిపాడుకు చెందిన రసూల్, ప్రసాద్, చిన్నాతో పాటు మరో వ్యక్తిని అరెస్టు చేశాన్నారు. దుంగలతో పాటు వాహనాల విలువ రూ.21లక్షలు ఉంటుందన్నారు. నిందితులను తిరుపతి కోర్టుకు తరలించామని తెలిపారు. కార్యక్రమంలో రూరల్ సీఐ విక్రమ్‌సింహ, ఎస్ఐ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇరువురికి గాయాలు

కడప (క్రైం), జూలై 24: కడప నగరం శంకరాపురం, కోటిరెడ్డిసర్కిల్ సమీపంలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో ఇరువురు గాయపడ్డారు. కోటిరెడ్డిసర్కిల్ వద్ద సీకేదిన్నె మండలం నాగిరెడ్డిపల్లెకు చెందిన మల్లికార్జునరెడ్డి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా మరో వాహనం వచ్చి ఢీకొనడంతో కాలుకు గాయమైనట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. అలాగే కడప శంకరాపురం వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కేసీ కెనాల్‌లో పడి వ్యక్తి మృతి

కడప (క్రైం), జూలై 24 : కడప నగరంలోని అల్మాస్‌పేట యానాదికాలనీకి చెందిన యాకసిరి నరసయ్య (51) కేసీ కెనాల్‌లో ప్రమాదవశాత్తు పడి మరణించాడు. అతని భార్య అంకమ్మ ఫిర్యాదు మేరకు.. తన భర్తకు అప్పుడప్పుడూ ఫిట్స్ వచ్చేవని, కాగితాలు, ప్లాస్టిక్ సామాన్లు ఏరుకుని సాయంత్రానికి వాటిని అమ్ముకుని జీవనం సాగించేవాడని, సోమవారం మధ్యాహ్నం 2గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బుధవారం ఉదయం స్థానికంగా ఉన్న వారు పోలీసుల ద్వారా తన భర్త మృతి చెందినట్లు సమాచారం అందించారని తెలిపారు. అనారోగ్యంతోనే కేసీ కెనాల్‌లో ప్రమాదవశాత్తు మృతి చెందాడని తెలిపారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంజీవరాయుడు తెలిపారు.

వృద్ధురాలిపై దాడి చేసి ఇంట్లో చోరీ

పీలేరు, జూలై 24: ముగ్గురు గుర్తు తెలియని దుండగులు వృద్ధురాలిపై దాడి చేయడమే కాకుండా ఇంటిలోని నగదు, బంగారు ఆభరణాలు దోచుకెళ్లిన సంఘటన బుధవారం పీలేరులో వెలుగు చూసింది. పీలేరు పోలీసుల కథనం మేరకు జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ సభ్యుడు, ప్రకృతి వ్యవసాయ నిపుణుడు బోదేషావలి పీలేరు-మదనపల్లె మార్గంలోని హుమ యూన్ కల్యాణ మండపం వద్ద తన తల్లి కె.ఎస్. జెహరాబీ(60)తో కలిసి ఉంటున్నాడు. మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో ఆమె ఒంటరిగా ఉన్న సమయంలో ముఖాలకు మాస్కులు ధరించిన ముగ్గురు దుండగులు ఇంటిలోకి ప్రవేశించి ఆమెపై దాడి చేయడమే కాకుండా ఇంటిలోని బంగారు ఆభరణాలు, నగదు దోచుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న బోదేషావలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుధవారం ఉదయం రాయచోటి డీఎస్పీ రామచంద్ర రావు, పీలేరు అర్బన్ సీఐ మోహన్ రెడ్డి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లతో కలిసి బోదేషావలి ఇంటిని పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. ఇంటిలో ఉన్న రూ.60 వేల నగదుతోపాటు తన తల్లి ఒంటిపై ఉన్న రూ.3 లక్షలు విలువజేసే ఒక బంగారు చైను, రెండు చేతి గాజులు, రెండు కమ్మలు, రెండు ముక్కుపుడకలు దుండగులు దోచుకెళ్లినట్లు బోదేషావలి తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చేపట్టాలి

● జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ ప్రభాకర్‌రెడ్డి

వల్లూరు, జూలై 24: వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుధ్య పనుల పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ సభాభవనంలో సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులను తప్పనిసరి చేయాలన్నారు. మంచినీటి ట్యాంకులు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. భూతల జలాశయాలు, మినరల్ వాటర్‌ప్లాంటుల్లో పదిహేనురోజులకొకసారి క్లోరినేషన్ చేయాలన్నారు. రోజువారి పారిశుధ్య పనులను నిర్వహించాలని... వాటిని రిజిస్టరులో నమోదు చేయాలని సూచించారు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉండేలా గ్రామాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారితో మమేకమై అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో మురుగునీటి కాల్వలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఏ చిన్న పొరపాటు జరిగినా ఈ సీజనులో డయేరియా వచ్చే అవకాశం ఉందన్నారు. మండలంలోని కార్యదర్శులు పీఆర్1 యాప్‌ను, హౌస్‌ట్యాక్స్‌ను, ఓడీఎఫ్ గ్రామాల్లో ఇంటింటి సర్వే చేసి వారం రోజుల్లో పూర్తి నివేదిక తయారు చేయాలని సూచించారు. ఎంపీడీఓ విజయభాస్కర్, పంచాయతీ అధికారి రమణారెడ్డి, పంచాయతీ విస్తరణాధికారి ప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ముజీబ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంఘాల బలోపేతానికి కృషి చేయాలి : డీఆర్‌డీఏ పీడీ



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ

రామాపురం, జూలై 24: గ్రామాల్లో ఉన్న స్వయం సహాయక సంఘాలు బలోపేతానికి అందరూ కృషి చేయాలని ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలో స్వయం సహాయక కార్యాలయంలో బుధవారం ఎంఎస్‌వోలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని స్వయం సహాయక గ్రూపులను బలోపేతం చేయాలన్నారు. వారి అవసరాల నిమిత్తం బ్యాంకుల్లో శ్రీనిధి రుణాలు, వ్యక్తిగత రుణాలు ఇప్పించడంలో సీసీలు కీలకపాత్ర పోషించాలన్నారు. గ్రామాల్లో నియమించిన వీవోఏలు సంఘం వద్దకు పోయి వారు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తున్నారా లేదా అన్న విషయాలను ఖచ్చితంగా పుస్తకాలలో పొందుపర్చాలని సూచించారు. ఎక్కడైనా గ్రూపులు రుణాలు తీసుకొని తిరిగి చెల్లించకపోతే.. ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి డబ్బులు తిరిగి చెల్లించే విధంగా చూడాలన్నారు. గ్రామ సంఘాల సమావేశం ఏర్పాటు చేసినప్పుడు సంబంధిత వీవోతో పాటు సీసీలు కూడా తప్పకుండా హాజరుకావాలని.. వారి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు.

కార్యక్రమంలో సీసీలు నాగభూషణ్‌రెడ్డి, శ్రీనివాసులు, నరసింహులు, నాగరాజు, ఆదినారాయణ, ప్రసాద్, ఎంఎస్‌వో, వీవోబీలు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడలూ అవసరం : డీఈవో



విద్యార్థులతో కలిసి క్రీడలాడుతున్న డీఈవో శివకుమార్‌రెడ్డి

రామాపురం, జూలై 24: మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని అన్నమయ్య జిల్లా డీఈవో శివకుమార్ రెడ్డి అన్నారు. శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని గువ్వలచెరువు తెలుగు, ఉర్దూ, నీలకంఠావుపేట తెలుగు, ఉర్దూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా అవసరమన్నారు. ఈ నెల 22 నుంచి 29 వరకు జరిగే భారతీయ సాంప్రదాయానికి చెందిన ఆటలను పర్యవేక్షించారు. వారం రోజుల పాటు వివిధ రకాల కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అనంతరం ఆయన నీలకంఠావుపేట తెలుగు హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో సమావేశమై విద్యార్థులకు సబ్జెక్టు వారీగా అర్థమయ్యే విధంగా బోధించాలని సూచించారు. మార్చిలో జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణతశాతం పెంచాలన్నారు. పాఠశాలకు సంబంధించిన మౌలిక సదుపాయాల గురించి హెడ్మాస్టర్ సుజాతమ్మను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు సంబంధించిన బుక్స్, షూస్, డ్రస్సులు పంపిణీ చేశారా అని ఆరా తీశారు. కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుజాతమ్మ, పాఠశాల పీడీ నాగేందర్‌రెడ్డి, డీవో ఆఫీస్ సీసీ అబిబ్, పీఆర్‌టీయూ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత తాగునీటి పరిష్కారం కోసం

ఇరిగేషన్ మినిస్టరుతో చర్చించిన కడప ఎమ్మెల్యే మాధవి



ఇరిగేషన్ మినిస్టరుతో చర్చిస్తున్న కడప ఎమ్మెల్యే మాధవి, పొలిట్‌బ్యూరోసభ్యుడు శ్రీనివాసరెడ్డిలు

(కడప-ఆంధ్రజ్యోతి): కడప నగరంలో తాగునీటి కోసం ప్రజలు పడుతున్న ఇబ్బందులపై శాశ్వత తాగునీటి పరిష్కారం కోసం ఇరిగేషన్ మినిస్టరు రామానాయుడును కడప నియోజకవర్గ ఎమ్మెల్యే ఆర్.మాధవీ, కడప పార్లమెంటు అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డిలు బుధవారం కలిసి చర్చించారు. ప్రపంచ బ్యాంకు ఇచ్చే నిధులతో పెన్నానదిపై తలపెట్టిన చెక్‌డ్యాంలు నిర్మాణం చేయాలని మంత్రికి వారు విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో నీళ్ల కోసం ప్రజలు ఇబ్బందులు పడ్డారని, ఆ సమయంలో పట్టించుకునే నాధుడే లేరని అన్నారు. కడప నగర ప్రజల తాగునీటి శాశ్వత పరిష్కారం చేయాలని ఈ సందర్భంగా వారు మంత్రిని కోరారు.

అత్తింటివారే
నా కూతురిని కొట్టి చంపేశారు

● పోలీసులకు మహిళ ఫిర్యాదు



సాయిప్రియ వివాహంనాటి ఫొటో (ఫైల్)

మదనపల్లె అర్బన్, జూలై 24: తన కూతురిని అత్తింటివారు కొట్టి చంపేశారంటూ లక్ష్మీదేవి అనే మహిళ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...

నీరుగట్టువారిపల్లె సమీ పంలోని బాబుకాలనీకి చెందిన శ్రీనివాసులు కుమా రుడు మణికంఠ, పట్టణంలోని రాంనగర్‌కు చెందిన లక్ష్మీదేవి కుమార్తె సాయిప్రియాంక (24) ఆరు నెలల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. కొంత కాలానికి కాపురంలో గొడవలు మొదలయ్యాయి. మద్యానికి బానిసలైన భర్తతో పాటు, మామ శ్రీనివాసులు డబ్బు కోసం సాయి ప్రియాం కను హింసించేవారు. రూ.5లక్షలు డబ్బు తీసుకు రావాలని రెండు నెలలుగా ఆమెను ఇబ్బంది లకు గురిచేస్తూ సక్రమంగా భోజనం చేయనిచ్చేవారు కారని లక్ష్మీదేవి ఫిర్యా దులో పేర్కొంది. మంగళవారం రాత్రి భర్త మణికంఠ, మామ శ్రీనివాసులు, అత్త ఉష, తాత మునెప్ప కలిసి సాయిప్రియాంకను కొట్టి చంపేసి, కమ్మీకు చీరతో ఉరివేశా రని, అనంతరం తన అల్లుడు తనకు ఫోన్ చేసి నీ కూతురు చనిపోయిందని చెప్పినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఆమె ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ వల్లిబసు తెలిపారు.

వన్‌టౌన్ ఎస్‌ఐని సస్పెండ్ చేయాలి

ధర్నాలో దళిత ప్రజాసంఘ నేతలు

కడప (మారుతీనగర్) జూలై 24: దళిత విద్యార్థి గడ్డ నవదీప్‌ను చితకబాదిన వన్‌టౌన్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డిని విధుల నుంచి సస్పెండ్ చేయాలని పలు దళిత, ప్రజా సంఘాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. పానీపూరి తినేందుకు నవదీప్ రాజీవ్‌పార్క్ వద్దకు స్కూటర్‌పై వెళ్తుండగా ఆ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ బండిని ఆపి చితకబాదడం దారుణమన్నారు. ఇందుకు నిరసనగా దళిత సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఆర్టీసీ బస్టాండు సమీప అంబేడ్కర్ విగ్రహం వద్ద చేపట్టిన నిరసన ధర్నాలో వారు మాట్లాడుతూ దళితులు కూడా తమ బిడ్డలను అల్లారుముద్దుగా పెంచుకుంటారనే ఇంగిత జ్ఞానం లేకుండా అత్యంత రాక్షసంగా విద్యార్థిపై దాడి చేయడం బాధాకరమన్నారు. మరో 24 గంటల్లోగా ఆ ఎస్‌ఐని విధుల నుంచి తొలగించి తీరాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో హోం మంత్రిని కలిసి తమ గోడు వెల్లబోసుకుంటామన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు డి. జయచంద్ర, కైపు రామాంజనేయులు, సగిలిగుర్రప్ప, బి.సి. గంగులు, మల్లేసు, రాజశేఖర్, ఏలియా, తిరుమలేసు, న్యాయవాది గుర్రప్ప, మహిళానాయకురాలు కళావతి, తదితరులతో పాటుగా పలువురు ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు.

ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

కమలాపురం రూరల్, జూలై 24: అగ్నిప్రమాదాలపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ వెంకటపతి అన్నారు. బుధవారం తహసీల్దారు కార్యాలయంలోని రికార్డుల గదిని పరిశీలించిన అనంతరం వీఆర్వో, వీఆర్‌ఏల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్యాలయ ఆవరణలో రికార్డు గదులను శుభ్రంగా, భద్రంగా ఉంచుకోవడం, అనుకోని ప్రమాదం జరిగితే వెంటనే స్పందించేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కలెక్టరు ఆదేశాల మేరకు తహసీల్దారు కార్యాలయ రికార్డుల గదిని, వివిధ రకాలుగా పరిశీలిస్తున్నామన్నారు. తహశీల్దారు కార్యాలయంలో వెంటనే రాత్రి కాపలాదారులు, అగ్ని ప్రమాద నివారణ పరికరాలు ఏర్పాటు చేసుకోవాలని తహసీల్దారును ఆయన ఆదేశించారు. తహసీల్దారు సుబ్రమణ్యం మాట్లాడుతూ వీఆర్‌ఏలను రాత్రి కాపలాదారులుగా నియమించామని, అగ్ని ప్రమాద నివారణ పరికరాలు ఇవ్వాలని ఆ శాఖ కార్యాలయ అధికారికి లెటరు కూడా పెట్టామన్నారు. అనంతరం ఆర్డీఓ, వీఆర్‌ఏలతో సమావేశం నిర్వహించి ప్రమాదాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీపైనే ఉందని, వారికి పలు సూచనలు చేశారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం వినాయకచవితి రోజు ప్రతి ఒక్కరూ వినాయక చవితి ఉత్సవాల్లో కేవలం మట్టి విగ్రహాలను మాత్రమే వాడేలా చూడాలన్నారు. కలెక్టరు ఆదేశాల మేరకు ఉత్సవ కమిటీలకు తహసీల్దార్లు, ఎంపీడీఓలు మట్టి విగ్రహాల వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. ఆ మేరకు వారి ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. పర్యావరణానికి అనుకూలంగా పండుగ చేసుకోవాలని సూచించారు.

రైతుబజార్‌ను వినియోగించండి

వేంపల్లె, జూలై 24: వేంపల్లె రైతు బజార్‌ను వినియోగంలోకి తీసుకురావాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరి ప్రసాద్ కోరారు. బుధవారం రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ రుచితకు వినతిపత్రం ఇచ్చిన ఆయన మాట్లాడుతూ రైతులు నేరుగా అమ్ముకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు బజార్లను నిర్మించిందన్నారు. రైతులకు ఎంతో ఉపయోగపడే రైతు బజార్‌ను వినియోగంలోకి తీసుకురావాలన్నారు.

కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు సుష్మ, ఎస్సీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివకృష్ణ, మునగాల ప్రసాద్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, సురేష్, కె.సురేష్, సుబ్బయ్య, సుమన్, నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో 'కొప్పర్తి'కి మహర్దశ

మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఇందిరెడ్డి శివారెడ్డి



చెన్నూరు, జూలై 24: నియోజకవర్గం చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని కొప్పర్తి పారిశ్రామికవాడకు ఎమ్మెల్యే పుత్తాక్రిష్ణచైతన్యరెడ్డి చొరవతో మహర్దశ పట్టనుందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, టీడీపీ జిల్లా మాజీ అధికార ప్రతినిధి ఇందిరెడ్డి శివారెడ్డి అన్నారు. చెన్నూరులో టీడీపీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే కొప్పర్తి పారిశ్రామికవాడకు అన్నిరకాల వసతులు కల్పించి ఎందరికో ఉపాధి అవకాశాలు తీసుకువస్తామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి గతంలో ప్రకటించారన్నారు. ఈమేరకు ఆయన కుమారుడు చైతన్య ఎమ్మెల్యే కావడంతో ఇటీవల పారిశ్రామికవాడను సందర్శించి కావాల్సిన సదుపాయాలపై ఆరా తీశారన్నారు. ఈ విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడం, ఆయన కేంద్రం దృష్టికి తీసుకెళ్లడంతో బడ్జెట్‌లో కొప్పర్తికి నిధులు కేటాయించారన్నారు. ఇది నియోజకవర్గ ప్రజలు జిల్లా ప్రజలు ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. ముఖ్యంగా బ్రహ్మంసాగర్ నుంచి అవసరమైన నీటిని సరఫరా చేయడం, విద్యుత్ సౌకర్యం మెరుగుపరచడం, రైలు, రోడ్డు, విమానం మార్గాలు అందుబాటులో ఉండడం ఇలా పారిశ్రామికవాడకు కావాల్సిన రవాణా దగ్గర కావడంతో ఈ పారిశ్రామికవాడ భవిష్యత్తులో ఎన్నో రకాల పరిశ్రమలకు పుట్టినిల్లుగా మారబోతుందన్నారు. ముఖ్యంగా జాతీయ రహదారులు కూడా ఉండడంతో భారీ పరిశ్రమలు కూడా ఇందులో ఏర్పాటయ్యే అవకాశం ఉందన్నారు. దాదాపు ఆరువేల ఎకరాలకు పైగా భూములున్న ఈ ప్రాంతం కడప జిల్లాకు తలమానికంగా నిలబడబోతోందని, అది కూడా ఎమ్మెల్యే చైతన్య సారధ్యంలో జరగబోతుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా నేత షబ్బీర్‌హుసేన్, బీసీ సెల్ అధ్యక్షుడు ఆటోబాబు, పట్టణ అధ్యక్షుడు ఆకుల చలపతి, మాజీ కోఆప్షన్ సభ్యులు గౌస్‌పీర్, మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షులు కరీం, మంజూర్ అహ్మద్, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు జిలానీ, కుందేటి క్రిష్ణయ్య పాల్గొన్నారు.

పునర్నిర్మాణమే ధ్యేయంగా సీఎం

తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు

కమలాపురం రూరల్, జూలై 24: రాష్ట్ర పునర్నిర్మాణమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు శ్రమిస్తున్నారని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు యల్లారెడ్డి పేర్కొన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి అధిక నిధులు సాధించిన సీఎం చంద్రబాబు, కొప్పర్తి పారిశ్రామికవాడకు నిధులు కేటాయింపులో కృషి చేసిన ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి చొరవను ప్రశంసించారు.

ఓడీఎఫ్ సర్వేను పూర్తి చేయాలి



ఇంజనీరింగ్ అసిస్టెంట్లపై సమావేశంలో డీపీఓ ప్రభాకర్‌రెడ్డి

సికెదిన్నె, జూలై 24: ఓడీఎఫ్ ప్లస్ సర్వేను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఓడీఎఫ్‌ప్లస్ సర్వేను నెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. ఇంటింటికీ తిరిగి సర్వేను పూర్తి చేయాలని తద్వారా లక్ష్యాలు త్వరగా అధిగమించాలన్నారు. డయేరియా వ్యాధి ప్రబలకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఇటీవల ఎక్కువగా డయేరియా విస్తరిస్తోందని, ముందుజాగ్రత్త చర్యలు తీసుకుని డయేరియా రాకుండా ప్రజలను కాపాడాలని అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ జిల్లా కోఆర్డినేటర్ రమణారెడ్డి, ఈఓఆర్‌డీ శ్రీధర్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి : బీటెక్ రవి



మంత్రులతో మాట్లాడుతున్న బీటెక్ రవి, తదితరులు

పులివెందుల టౌన్, జూలై 24: పులివెందుల నియోజకవర్గం అభివృద్ధికి సహకరించాలని టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి కోరారు. బుధవారం రాష్ట్రవ్యవసాయ శాఖ, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల, మార్కెటింగ్, సహకార, మత్స్యకారశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, బీసీ సాంఘిక సంక్షేమ శాఖ, చేనేత, జౌళిశాఖ మంత్రి సవితను బీటెక్ రవి కలిశారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను వివరించారు. ఆయనతో పాటు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, కడపజిల్లా టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవి, సింహాద్రిపురం మాజీ జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, తొండూరు మండల టీడీపీ నేతలు మోజెక్‌కుమార్‌రెడ్డి తదితరులు కలిసి జిల్లా సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు.

వీసీగా నియమించడం సిగ్గుచేటు

- అఖిలభారత విద్యార్థి సమాఖ్య



ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నేతలు

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 24: తీవ్ర లైంగిక ఆరోపణలున్న కృష్ణారెడ్డిని వైవీయూ ఇన్‌చార్జ్ వీసీగా నియమించడం సిగ్గుచేటని, తక్షణమే తొలగించాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడ లెనిన్ సెంటరులో ఆందోళన చేపట్టి, పోలీసుల అత్యుత్సాహంతో దాసరి భవన్ ముందే ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇన్‌చార్జ్ వీసీగా నియామకమైన క్రిష్ణారెడ్డి గతంలో కృష్ణ యూనివర్శిటీ రిజిస్ట్రరుగా రెండేళ్ల కాలాన్ని తన పలుకుబడితో మూడేళ్లు చేసుకుని తన అవినీతి, లైంగిక దురలవాట్లతో ఉద్యోగినులు, విద్యార్థులను లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడన్న ఆరోపణలపై ఏడాదిన్నరకే ప్రభుత్వం తనపై కమిటీ వేసి సస్పెండ్ చేసిందన్నారు. వైవీయూ ప్రిన్సిపాల్‌గా ఇదే పద్ధతుల్లో వ్యవహరించిన తీరు స్పష్టంగా యూనివర్శిటీ మొత్తం గమనించిందన్నారు. కమిటీ వేసి విచారణలో ఆరోపణలు వాస్తవమని తేల్చిందని, వెంటనే ప్రిన్సిపాల్‌గా తొలగించిందన్నారు. వీసీ క్రిష్ణారెడ్డిని ఏ విలువలతో నియమించిందో విద్యాశాఖ మంత్రి లోకేశ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే ప్రభుత్వం, ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరబ్ గౌర్ ఆయన నియామకాన్ని వెనక్కి తీసుకోకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు. గవర్నరు దృష్టికి కూడా తీసుకుపోతామన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వలరాజు, రాష్ట్ర కోశాధికారి సాయికుమార్, నాయకులు రంజిత్, జగదీశ్ పాల్గొన్నారు.

రాష్ట్ర పునర్నిర్మాణమే సీఎం ధ్యేయం

పులివెందుల టౌన్,జూలై 24: రాష్ట్ర పునర్నిర్మాణమే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని తెలుగు యువత పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ రెడ్డి, రాష్ట్రకార్యనిర్వహణ కార్యదర్శి రవితేజారెడ్డి అన్నారు. పులివెందులలో బుధవారం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆకాంక్ష అమరావతి రాజధాని నిర్మాణమన్నారు. అందుకు తగ్గట్లు కేంద్ర బడ్జెట్‌లో రూ.15వేలకోట్లు కేటాయించడం, పోలవరం ప్రాజెక్టు సత్వర నిర్మాణానికి కేంద్రం సంపూర్ణ సహకా రం అందిస్తున్నట్లు ప్రకటించడం హర్షణీయమన్నారు. కార్యక్రమం లో పలువురు టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యమాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యం

జిల్లా సమావేశంలో ఎంఆర్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

కడప (మారుతీనగర్) జూలై 24: మూడు దశాబ్దాలకు పైగా ఎస్సీ వర్గీకరణ సాధన కోసం అలుపెరుగని రీతిలో సాగుతున్న మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి (ఎంఆర్పీఎస్) ఉద్యమాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లడమే ఏకైక లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఆ సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి డి. రామకృష్ణ మాదిగ స్పష్టం చేశారు. తమ సమతి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్నిజిల్లాల్లో జిల్లా కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశాలు చేపట్టారు. బుధవారం కడప ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎదుగు బొదుగూ లేని మాదిగ జాతి అభివృద్ధి చెందాలంటే వర్గీకరణతోనే సాధ్యమన్నారు. 20 ఏళ్లకు పైగా మాదిగ జాతిని జాగృతం చేసి ఏకతాటిపైకి తీసుకురావడమే ధ్యేయంగా మందకృష్ణ ఉద్యమాన్ని భుజాలకెత్తుకుని మరీ ముందుకు సాగుతున్న సంగతి తెలిసిందే అన్నారు. ఆ క్రమంలో ఇటీవల మూడోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం, అధికారంలోకి రావడంతో తిరిగి వర్గీకరణ సాధ్యమవుతుందనే ఆశ మరోమారు చిగురిస్తోందన్నారు. ఆ క్రమంలో నెల రోజులు జాతిని మేల్కొలిపేలా గ్రామ గ్రామాన ఎంఆర్పీఎస్ జెండా ఆవిష్కరణలు చేపడుతున్నట్లు వెల్లడించారు. దీంతో ఉద్యమపోరు పతాకస్థాయికి చేరుస్తామన్నారు. తద్వారా పాలక ప్రభుత్వాలకు ఉద్యమ సెగ తగిలేలా చేసి వర్గీకరణ సాధించుకుతీరుతామన్నారు.

జిల్లా సమావేశం అనంతరం జిల్లా అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియలో వరుసగా రెండో సారి జిల్లా అధ్యక్షుడిగా మానికింది వెంకటేష్ నియమితులయ్యారు. నేతలు మాతయ్యబాబు, రాజు, పలువురు అనుబంధ సంఘాల నేతలు, వీహెచ్‌పీఎస్ నేతలు ఆంజనేయులు, చిన్నసుబ్బయ్య పాల్గొన్నారు.

'జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పెట్టాలి'

కడప(కలెక్టరేట్) జూలై 24: జూనియర్ కళాశాలల్లో చదువు కొనే అన్ని వర్గాల విద్యార్థుల్లో చాలా మంది పేదలు ఉన్నారని, వాంరందరికీ మధ్యాహ్న భోజనం పెట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలనీ ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిళ్ల బాబు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి జూనియర్ కళాశాల్లో చదువుకునే పేద విద్యార్థులకు రోజూ మధ్యాహ్న బోజనం అందక, చదువులు అర్థాంతరంగా ఆగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేసే క్రమంలో జూనియర్ కళాశాల్లో కూడా మధ్యాహ్న బోజనం అమలు చేస్తే పేద విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. అలాగే ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాల్లో మౌలిక సదుపాయాలు సక్రమంగా లేవని ఉన్నతాధికారులు తనిఖీ చేయాలన్నారు. కార్యక్రమంలో అరుణ్ కుమార్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

డబ్బు తీసుకున్నారని మహిళ ఫిర్యాదు

కడప (సెవెన్ రోడ్స్), జూలై 24: చింతకొమ్మదిన్నె మండలానికి చెందిన హెచ్‌ఐవీ పేషంటుకు చికిత్సనందిస్తున్న రిమ్స్ ఉద్యోగి తన నుంచి రూ.20వేలు తీసుకున్నాడని బుధవారం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఆర్ఎంఓకు ఫిర్యాదు చేశారు. మహిళ హెచ్‌ఐవీ చికిత్స తీసుకుంటూ మందులు తీసుకోవడానికి తరచూ ఆస్పత్రికి వస్తుండేవారు. ఈ క్రమంలో అక్కడ పనిచేస్తున్న (కౌన్సిలరు)కు పరిచయం ఏర్పడి అతనికి రూ.20వేలు ఫోన్‌పే ద్వారా చెల్లించినట్లు తెలిపారు. సదరు వ్యక్తిని ఆమె పదే పదే డబ్బు ఇవ్వమని అడగ్గా అసభ్య పద జాలంతో దూషిస్తూ నేను డబ్బు ఇవ్వనని అన్నాడని తెలిపారు. దీంతో ఆమె ఆర్ఎంఓకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయమై ఆర్ఎంఓ శ్రీనివాసులను వివరణ కోరగా, సదరు మహిళ ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనని, దీనిపై తగు విచారణ చేస్తామని, నిజాలు తెలుసుకుని చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రతి గ్రామ సమాఖ్య అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న ఏపీఓ అపర్ణ

కమలాపురం రూరల్, జూలై 24: మండల పరిధిలోని ప్రతి గ్రామ సమాఖ్య ఆదాయం పెంపొందించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఏపీఎం అపర్ణ తెలిపారు. బుధవారం స్థానిక మండల వెలుగు కార్యాలయంలో సమైఖ్య సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2023-24 ఆడిట్ నివేదికను సభ్యులకు చదివి వినిపించారు. ఏడాది కాలంలో మండల సమాఖ్య ఆర్థికంగా అభివృద్ధి చెందిందన్నారు. 2024-25 సంవత్సరాలకు సంబంధించి ఆర్థిక ప్రణాళికలు తయారు చేశామన్నారు. ప్రతి సంఘం సభ్యులు తాము తీసుకున్న రుణాలతో చిన్న వ్యాపారమైనా ఏర్పాటు చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. అనంతరం కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షురాలిగా డీవీ సుమలత, ఉపాధ్యక్షురాలిగా మున్ని, కార్యదర్శిగా సుబ్బమ్మ, సహాయ కార్యదర్శిగా శిరీషా, కోశాధికారిగా పాలకొండమ్మను ఎన్నుకున్నట్లు తెలిపారు.

రాష్ట్ర క్లాసులు జయప్రదం చేయండి

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 24: ఈ నెల 27, 28, 29 తేదీల్లో నంద్యాలలో జరిగే డీవైఎఫ్ఐ రాష్ట్రస్థాయి నాయకత్వ శిక్షణా తరగతులు జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ కోరారు. బుధవారం జిల్లా కార్యాలయంలో రాష్ట్ర క్లాసుల కరపత్రాలు విడుదల చేసిన వారు మాట్లాడుతూ నాలుగు రోజులు పాటు జరిగే క్లాసులకు రాష్ట్రం మొత్తం నాయకత్వం హాజరవుతారన్నారు. ముఖ్యంగా భవిష్యత్ కార్యాచరణ అజెండాగా తీసుకుని ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో నగర కన్వీనర్ విజయ్, కోకన్వీనర్ పెద్దన్న, సభ్యులు భాస్కర్‌రెడ్డి, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు కలుషితం కాకుండా చూసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న
జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి

పెండ్లిమర్రి, జూలై 24: గ్రామాల్లోని తాగునీరు కలుషితం కాకుండా నీటి ట్యాంకులు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీర్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించారు. ఫ్రైడే డ్రైడే, సీజనల్ వ్యాధుల గురించి సమీక్షించారు. నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్‌బాల్స్ వేయడం, కుళాయిల లీకేజీలు అరికట్టడం తదితరవాటిని వివరించారు. కార్యక్రమలో డీఎల్‌పీఓ రమణారెడ్డి, రీసోర్స్ పర్సన్‌రాఘవరెడ్డి, ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు సాధికారత సాధించాలి

డీఆర్డీఏ పీడీ ఆనంద్‌నాయక్

వేంపల్లె, జూలై 24: మహిళలు అన్ని రంగాల్లో సాధికారత సాధించాలని డీఆర్డీఏ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్‌నాయక్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ సభాభవనంలో స్వయం సహాయక వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిసభ్యురాలు ఆర్థిక విషయాలు, ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, అందుకు బ్యాంకులు సహకరిస్తాయని సూచించారు. అనంతనం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దివిజ సంపతి, యూనియన్ బ్యాంక్ మేనేజర్ వెంకటరమణ, డీసీసీ బ్యాంక్ మేనేజర్ బాలాజీరాజు, ఏపీజీబీ ఫీల్డ్ అధికారి ఉత్తమ్‌రెడ్డి, ఏపీఎం బాలస్వామి, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు

సింహాద్రిపురం, జూలై 24: మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఎంపీడీఓ సాల్మన్ రాజ్ పేర్కొన్నారు. పని చేస్తున్న ప్రదేశాల్లో మహిళల పట్ల లైంగిక వేధింపులు, అత్యాచారాలు, ఈవ్ టీజింగ్ వంటి ఆకృత్యాల నిర్మూలనపై సింహాద్రిపురం ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో ఎంపీడీఓ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కుమార్, ఈఓపీఆర్డీ పద్మనాభరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, గ్రామ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

పోష్ యాక్ట్‌పై అవగాహన అవసరం

వేముల, జూలై 24: పోష్ యాక్ట్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వేంపల్లె ఐసీడీఎస్ సీడీపీఓ సునీత అన్నారు. వేములలో బుధవారం మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం-2013(పోష్)పై పంచాయతీ కార్యదర్శులకు, మహిళా పోలీసులకు శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రులు, నర్సింగ్ హోంలు, స్పోర్ట్స్ కాంప్లెక్సులు, ట్రైనింగ్ సెంటర్లు, ఎన్జీఓలు, సంస్థలు, కార్పొరేట్ సంస్థలు, భవననిర్మాణం జరుగుతున్న ప్రాంతాలు, ఇండస్ట్రియల్ ప్రాంతాలు అన్నీ ఈ చట్టపరిధిలోకి వస్తాయన్నారు. ప్రతి మహిళకు ఈ చట్టంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ, డీటీ, ఎంఈఓ, పోలీసులు, కళాశాల ప్రిన్సిపాల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

ప్రజలకుమెరుగైన సేవలు అందించాలి

పులివెందుల రూరల్, జూలై 24: ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు వైద్య, ఆరోగ్య సిబ్బందికి సూచించారు. బుధవారం తొండూరు మండలం బోడివారిపల్లె గ్రామంలో డాక్టర్ అరిఫుల్లా ఆధ్వర్యంలో జరుగుతున్న వైద్యశిబిరాన్ని తనిఖీ చేసిన ఆయన గ్రామంలో జ్వరాలు రావడానికి గల కారణాలను తెలుసుకున్నారు. ఇంట్లో వాడిన వృథా నీటిని, బట్టలు ఉతికిన నీటిని వీధుల్లో వదలడంతో దోమలు వృద్ధి చెంది జ్వరాలు వస్తున్నాయని గుర్తించారు. దీనిపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. క్యాంప్‌ను రెండు రోజులు కొనసాగించాలని ఆదేశించారు. తొండూరు పీహెచ్‌సీని తనిఖీ చేసి ప్రసవాలు, రికార్డులు, రోజువారీ ప్రజలకు అందుతున్నసేవల గురించి ఆరాతీశారు.

స్కౌట్స్, గైడ్స్ సేవలు ప్రశంసనీయం

శిక్షణలో ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ : ఒంటేరు



శిక్షణలో మాట్లాడుతున్న ఒంటేరు శ్రీనివాసులురెడ్డి

కడప (మారుతీనగర్) జూలై 24: దేశ సేవలో స్కౌట్స్, గైడ్స్ సేవలు ప్రశంసనీయమని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఒంటేరు శ్రీనివాసులురెడ్డి కొనియాడారు. భారత్ స్కౌట్స్, గైడ్స్ ఆధ్వర్యంలో విద్యాశాఖ విభాగ ఉత్తర్వుల మేరకు శంకరాపురంలోని స్కౌట్ హాలులో ఈనెల 19 నుంచి 25వరకూ జిల్లాలోని కబ్, స్కౌట్, రోవర్ మాస్టర్లకు (టీచర్స్, కళాశాలల లెక్చరర్స్) బేసిక్ శిక్షణ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఆరో రోజు బుధవారం సాగిన శిక్షణకు ఆయన మాట్లాడుతూ వారంరోజుల శిక్షణ ద్వారా నేర్చుకున్న అంశాలను వారి పాఠశాలల, కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులకు యూనిట్‌కు 30 మందికి చొప్పున నేర్పించి తద్వారా వారిని ఉత్తమ గైడ్స్‌గా తీర్చిదిద్దాలన్నారు. ప్రధానంగా నేటి సమాజంలో అడుగంటుతున్న నైతిక విలువలు, దేశభక్తి, క్రమశిక్షణ, మానవవిలువలు, సమాసేవ, ఏదేని ప్రమాదాలు జరిగినపుడు తనను తాను రక్షించుకునేలా స్వయం రక్షణను అత్యుత్తమంగా నేర్పించాల్సిన ఆవశ్యకత కలదన్నారు. ప్రకృతి విపత్తులు సంభవించినపుడు అత్యంత చాకచక్యంగా వాటిని ఎదుర్కొనే నేర్పరితనాన్ని సైతం అందిపుచ్చుకునేలా చేయాలన్నారు. ఏదేమైనా దేశ సేవలో స్కౌట్స్, గైడ్స్ తరించేలా చేసే బృహత్తర కార్యక్రమాన్ని త్రికరణశుద్ధిగా చేపట్టి తద్వారా తల్లి భరతమాత మనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్నారు. స్కౌట్ అసోసియేషన్ ట్రెజరర్ బి. శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఉత్తమ స్కౌట్ యూనిట్‌గా జిల్లా స్కౌట్ అసోసియేషన్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రమీల, జాయింట్ సెక్రటరీ వెంకటసుబ్బయ్య, పలువురు స్టేట్ ఆర్గనైజింగ్ కమిటీ అసిస్టెంట్ లక్ష్మీకర, తదితరులు పాల్గొన్నారు.

గండికోట నుంచి మైలవరం జలాశయానికి నీటి నిలుపుదల

కొండాపురం, జూలై 24: గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి బుధవారం నీటిని నిలుపుదల చేసినట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు.ప్రస్తుతం స్లూయిస్ గేట్ల ద్వారా నీరు విడుదలవుతుండగా వాటిని కూడా మూసివేశారు.కాగా బుధవారం సాయంత్రానికి 1.5 టీయంసీల నీరు మాత్రమే గండికోట ప్రాజెక్టులో నిల్వ ఉన్నట్లు డీఈ తెలిపారు..

అనుమతి లేని లేఅవుట్లకు నోటీసులు

పోరుమామిళ్ల, జూలై 24 : మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలో అనుమతి లేకుండా వేసిన లేఅవుట్లకు నోటీసులు జారీ చేసినట్లు మండల పరిషత్ విస్తరణాధికారి రాజీవ్‌రెడ్డి తెలిపారు. రంగసముద్రం పంచాయతీ పరిధిలో నూరు ఎకరాల విస్తీర్ణంలో 14 లేఅవుట్లకు పైగా అనుమతి లేకుండా వేశారన్నారు. కడప అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ అనుమతి లేకండా వేసిన లే అవుట్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. దీనికనుగుణంగా ఆయా లేఅవుట్ల యజమానులకు నోటీసులు ఇచ్చామన్నారు. ఎవరైనా అనుమతి లేకుండా లేఅవుట్లను వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

బొలేరో,స్కూటర్ ఢీ

ఒకరికి గాయాలు

ఖాజీపేట, జూలై 24: కడప-కర్నూలు జాతీయ రహదారిలోని కొత్తనెల్లూరు సమీపంలో బొలేరో వాహనాన్ని స్కూటర్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు పోరుమామిళ్ల మండలం పారంపల్లి గ్రామానికి చెందిన గరిమెళ్ల బాబు పని నిమిత్తం కడపకు వెళ్లి తిరిగి వస్తుండగా కడప నుంచి మైదుకూరుకు వెళుతున్న బొలేరో వాహనాన్ని కొత్తనెల్లూరు సమీపంలో వెనుక భాగంలో ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం టోల్‌గేట్ అంబులెన్స్ ద్వారా రిమ్స్‌కు తరలించారు. ఆమేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మట్టి విగ్రహాలను విక్రయించాలి

బద్వేలు, జూలై24: రాబోయే వినాయక చవితి, దుర్గాష్టమి తదితర పండుగలకు ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాలు విక్రయించినట్లయితే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోలు బోర్డు ఆదేశాల మేరకు పర్యావరణానికి హాని చేసే ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌పై నిషేధంలో భాగంగా దాంతో తయారు చేసిన విగ్రహాలు విక్రయించరాదని మట్టి విగ్రహాలనే విక్రయించాలని విక్రయదారులకు సూచించారు. దీనిని అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సూచించారు.

జమ్మలమడుగులో ట్రాఫిక్ సమస్య

జమ్మలమడుగు, జూలై 24: జమ్మలమడుగులో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారింది. ఏరోడ్డులో చూసినా నిబంధనలు ఉల్లంఘించి రోడ్డుపైనే వాహనాలు నిలపడంతో వాహనదారులకు రాకపోకలు చాలా ఇబ్బంది ఉంది. పాత బస్టాండులో నిబంధనలు బేఖాతరు చేశారు. ప్రతిరోజూ అర్బన్ పోలీసు స్టేషన్‌కు సంబందించిన ఒక కానిస్టేబుల్ మాత్రమే ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్నారు. కూరగాయల మార్కెట్‌వీధి, తాడిపత్రి రోడ్డులోని సబ్‌జైలు ఎదురుగా వాహనాలు ట్రాఫిక్‌లో తరచూ సమస్య ఏర్పడుతోంది. దుకాణాదారులు రోడ్డును ఆక్రమించడమే ప్రధాన కారణమని చెప్పవచ్చు. నియంత్రించే అధికారులు నిర్లక్ష్యంతో ఆ ప్రాంతానికి రావడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాగే ఆర్టీసీ బస్టాండు ఎదురుగా దుకాణాల వద్ద రోడ్డుపైనే మందుబాబులు విచ్చలవిడిగా రోడ్డును ఆక్రమించి ఇబ్బంది కలిగిస్తున్నట్లు వాహనదారులు ఆరోపిస్తున్నారు. అలాగే స్టేట్‌బ్యాంక్ మెయిన్‌బ్రాంచ్ వద్ద, సంజాములమోటు, పెద్దపసుపుల మోటులో ట్రాఫిక్ సమస్య ఉంది. పోలీసు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



సబ్‌జైలు ఎదురుగా నిలిచిపోయిన ట్రాఫిక్

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 24: సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలులో, సరస్వతి విద్యామందిరం పాఠశాలలో సీజనల్ వ్యాధులు-స్టాప్ డయేరియాపై విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ నుంచి నవంబరు వరకు వర్షాకాలం ఉంటుందని, నీరు నిలువ ఉండడం వలన దోమలు వృద్ధి చెందుతాయన్నారు. దోమల వలన మలేరియా, చికెన్ గున్యా, మెదడువాపువ్యాధి, బోధకాలు, డెంగీ వచ్చే అవకాశం ఉందన్నారు. దోమల వ్యాప్తిని అరికట్టడానికి ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. నీటి నిలువలను, పాత్రలను శుభ్రపరచి ఆరిన తర్వాత నీటిని నింపుకోవాలని సూచించారు. ఇళ్ల, ఇంటి పరిసరాల్లో నీరు నిలువ ఉండకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు హిమబిందు, ఆలీం, పాఠశాల హెచ్‌ఎం గురప్ప, శ్రీనివాసులు, డీపీఎంవో శివశంకరయ్యా, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సబ్‌యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కొండాపురం..: డయేరియా వ్యాధిపై బుధవారం చౌటిపల్లె జడ్పీహైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు.వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలనిసూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెడ్మాస్టర్ క్రిష్టారెడ్డి ,ఎంపీహెచ్‌వో ధనలక్ష్మీ ,సీహెచ్‌వో కల్యాణి, ఏఎన్‌ఎం అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.



కొండాపురం...చౌటిపల్లె జడ్పీహైస్కూల్‌లో డయేరియాపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

ఘనంగా హుస్సేన్‌పీర్ ఉరుసు

బద్వేలు రూరల్, జూలై 24 : పట్టణంలోని దర్గావీధిలో ఉన్న హజరత్ హుసేన్‌పీర్ అవులియా వారి ఉరుసు ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధ, గురువారాల్లో రెండురోజుల పాటు జరిగే ఉరుసు ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామివారికి గంధం మహోత్సవం వైభవంగా చేశారు. దర్గాపీఠాధిపతి సజ్జా దనశీన్ సయ్యద్ మహ్మద్‌కరీముల్లా హుసేన్‌షా ఖాద్రి ఇంటి నుంచి మేళతాళాలతో గంధాన్ని ఊరేగింపుగా దర్గాకు తీసుకుని వచ్చి ఫాతెహా అనంతరం స్వామివారి గంధం భక్తులకు అందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అన్వర్, షరీఫ్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

117 జీవోను వెంటనే రద్దు చేయాలి

పోరుమామిళ్ల, జూలై 24 : తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే వర్తింపజేయాలని, 117 జీవో వెంటనే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ సత్తార్ అన్నారు. బుధవారం స్థానిక ఏపీటీఎఫ్ 257 రీజనల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు నిర్మూలనపై అవగాహన



కుష్ఠు నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

అట్లూరు, జూలై 24 : జాతీయ కుష్ఠువ్యాధి నియంత్రణ అధికారి ఎస్.రవిబాబు, అడిషనల్ డీఎంహెచ్‌వో ఉమామహేశ్వర్‌రావు పర్యవేక్షణలో కుష్ఠువ్యాధి నిర్మూలనపై అట్లూరు జడ్పీహైస్కూలు విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. అలాగే అట్లూరు గ్రామ ప్రజలకు కుష్ఠువ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి హమీదాబబేగం, కమ్యూనిటీ హెల్త్‌అధికారి మురళీక్రిష్ణ, వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కార్గిల్ సిల్వర్ జూబ్లీ వేడుకలకు హాజరుకండి

మాజీ సైనిక అసోసియేషన్ నాయకుడు రాముడు

పోరుమామిళ్ల, జూలై 24 : పోరుమామిళ్లలో ఈ నెల 26న జరిగే కార్గిల్ సిల్వర్ జూబ్లీవేడుకలకు హాజరు కావాలని మాజీ సైనిక అసోసియేషన్ నాయకుడు రాముడు తెలిపారు. కార్గిల్ యుద్ధం జరిగి 25 ఏళ్లు కావస్తున్న సందర్భంగా కాశినాయన, బి.కోడూరు, పోరుమామిళ్ల మాజీ సైనికులు, వీరనారీమణులందరూ సైనిక కార్యాలయంలో హాజరు కావాలన్నారు. ముందుగా పోరుమామిళ్ల స్టేషన్ నుంచి మాజీ సైనికుల కార్యాలయం వరకు బైకుర్యాలీ ఉంటుందన్నారు. అనంతరం అమర జవాను స్థూపానికి గౌరవ వందనం ఉంటుందన్నారు. కార్యక్రమానికి మాజీ సైనికులు వారి కుటుంబ సభ్యులతో హాజరు కావాలని కోరారు.

అంగన్వాడీ సెంటర్ పరిశీలన

ఖాజీపేట, జూలై 24: అంగన్వాడీ కేంద్రాన్ని డీఈవో అనూరాధ ఆకస్మికంగా పరిశీలించారు. బుధవారం మండల పరిధిలోని బాలుర హైస్కూలు అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్కూలులో మంచినీరు, టాయిలెట్స్, మధ్యాహ్న భోజనం, పాఠశాల కిచెన్, స్కూల్ శానిటేషన్, స్కూల్ సేఫ్టీ పరిశీలించారు. పిల్లలకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా చూడడంతోపాటు పిల్లలకు అర్థమయ్యే విధంగా విద్యాబోధన చేయాలన్నారు. అనంతరం ఖాజీపేట మెయిన్ అంగన్వాడీ సెంటర్‌ను పరిశీలించి పిల్లలపట్ల జాగ్రత్త తీసుకోవాలని, సెంటర్‌కు పిల్లలను తెచ్చేటప్పుడు ట్రాఫిక్‌లో చూసుకుని రావాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు,అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



పిల్లలను ప్రశ్నిస్తున్న డీఈవో

మహిళల భద్రతకోసమే పోష్ చట్టం: సీడీపీఓ

కాశినాయన,జూలై 24: మహిళలు లైంగికంగా వేధింపులకు గురికాకుండా కాపాడడం కోసమే ప్రభుత్వం పోష్ చట్టాన్ని తెచ్చిందని ఎంఈవో నిర్మల,ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, పోరుమామిళ్ళ ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీవో లక్ష్మీదేవి పేర్కొన్నారు.బుధవారం నర్సాపురం వెలుగు కార్యాలయ సభాభవనంలో పోష్ చట్టం 2013పై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారుమాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న మహిళలు అంతర్గత కంప్లయింట్ చేయడంతోనే లైంగిక వేధింపులు నివారణ సాధ్యమని ప్రతిఒక్కరూ ఈ పోష్ చట్టంపై అవగాహనకల్గి ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు లక్ష్మీప్రసన్న, ఏఎస్‌ఐ కాశయ్య, అంగన్వాడీ మండల పర్యవేక్షకురాలు చంద్రకళ, పలువురు హెడ్‌మాస్టర్‌లు,పంచాయతీ సెక్రటరీలు,వీఆర్వోలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ అభివృద్ధికి ప్రత్యేక అవకాశం : ఎంపీడీఓ

గోపవరం, జూలై 24 : ఉపాధి హామీ ద్వారా వంద శాతం సబ్సిడీతో పండ్ల తోటల పెంపకం చేపట్టే అవకాశం రైతులకు ఉందని ఎంపీడీవో రాధాక్రిష్ణ అన్నారు. స్థానిక మహిళా మండలి సమాఖ్య కార్యాలయంలో బుధవారం పండ్లతోటల పెంపకంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు ఎకరాల భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులకు ఈ అవకాశం ఉంటుందన్నారు. ఈవోపీఆర్‌డీ షేక్ హసీనా మాట్లాడుతూ ఉపాధి పథకం ద్వారా వ్యవసాయాభివృద్ధికి ప్రత్యేక అవకాశాలు ప్రభుత్వంకల్పిస్తుందన్నారు. హార్టికల్చర్ అధికారి మల్లేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మునగతోటల రైతులకు ప్రత్యేక రాయితీ ఉంటుందన్నారు. మొక్కల పెంపకానికి అవసరం అయ్యే ఖర్చు భరిస్తామన్నారు. పూర్తి వివరాలకు ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీయం విజయమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

కస్తూర్బాలో క్రీడా దినోత్సవం

చాపాడు, జూలై 24: చాపాడులోని కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలలో బుధవారం క్రీడా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఆ పాఠశాల ఎస్‌వో నాగలక్ష్మి, ఎంఈవోలు రవి శంకర్, వంశీకృష్ణ బాలికలకు నిర్వహించిన పలు రకాల ఆటలను పర్యవేక్షించారు. బాలికలు కబడ్డీ, ఉప్పాట, గోలిగుండ్ల ఆట, బొంగరం తిప్పుట, కోతి ఆట, చుక్‌చుక్ రైలు వంటి పలు రకాల ఆటలను బాలికలకు నిర్వహించినట్లు పీఈటీ హసీనా తెలిపారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ క్రీడలు బాలికలకు మానసిక ఆనందాన్ని ఇస్తాయన్నారు. బాలికలందరు చదువుతోపాటు ఆటలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.



ఉప్పాట ఆడుతున్న బాలికలు

ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి

ఎర్రగుంట్ల, జూలై 24: రైతులు ఉత్తమ యాజమాన్య పద్ధతులైన కాలిబాట తీయడం పాటిస్తే మంచి దిగుబడిని సాధించవచ్చునని ఏడీ ఏ నరసింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎర్రగుంట్ల మండలం లోని చిన్న దండ్లూరులో సాగుచేస్తున్న వరి పంటను ఆయన ఏవో శ్రీకాంత్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఏవో శ్రీకాంత్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు కుమారి శ్రీలత, రైతులు పాల్గొన్నారు.

మైదుకూరు రూరల్..: మండలంలోని ఆదిరెడ్డిపల్లెలో రైతులు వేసిన నారుమడిని బుధవారం మండల వ్యవసాయశాఖ అధికారులు లక్ష్మీప్రసన్న,క్రిష్ణమూర్తి పరిశీలించారు.అనంతరం వారు రైతులతో మాట్లాడుతూ బాగా చివికిన పశువుల పేడను చల్లిన పది రోజుల తరువాత డీఏపీ,యూరియా,యంఓపీలు ఒక్కొక్కటి కేజీ చొప్పున చల్లాలని తెలిపారు.ఆరోగ్యవంతమైన నారు కోసం కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలని తెలిపారు.నారు పీకడానికి వారం ముందు కార్బోఫ్యూరాన్,3జీ గ్రాన్యూల్స్ ఐదు సెంట్లకు కేజీ చొప్పున వేయాలని తెలిపారు.

ర్యాంపుల తొలగింపుపై రచ్చ

ప్రొద్దుటూరు, జూలై 24 : గత ఐదేళ్ల వైసీపీ పాలనలో టౌన్‌ప్లానింగ్ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా కట్టిన కట్టడాలపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మున్సిపల్ అధికారులు సమీక్ష సమావేశంలో ఆదేశించారు. అంతేకాకుండా వైఎంఆర్ కాలనీ అప్రూవల్ లేఅవుట్‌లో రోడ్లపైకి ర్యాంపులు వేసి వున్న వాటిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇదే అదనుగా అక్రమ కట్టడాలపై కాకుండా ర్యాంపుల తొలగింపు పనులకు టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మునిరత్నం యత్నించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా బుధవారం ఉదయం ప్రవీణ్‌రెడ్డి ఇంటి వద్ద మొదటగా ఎక్స్‌కవేటర్ పెట్టి ర్యాంపును తొలగించే ప్రయత్నం చేశారు.దీంతో ప్రవీణ్‌రెడ్డి టౌన్‌ప్లానింగ్ అధికారుల చర్యలను అడ్డుకున్నారు.ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా నేరుగా వచ్చి ర్యాంపులు తొలగిస్తే కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడరా అని వాదించారు. ఇది కమిషనర్ ఆదేశించారని చెప్పి ఏసీపీ మునిరత్నం పేర్కొన్నారు. దీనిపై కమిషనర్ రఘురామిరెడ్డితో ప్రవీణ్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. దీంతో తాత్కాలికంగా కమిషనర్ ర్యాంపులు తొలగించవద్దని ఆదేశించారు.

'వైవీయూ వీసీ కృష్ణారెడ్డిని వెంటనే తొలగించాలి'

కొండాపురం, జూలై 24 : లైంగిక ఆరోపణలు ఉన్న యోగి వేమన యూనివర్సిటీ వీసీ కృష్ణారెడ్డిని వెంటనే తొలగించాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు.బుధవారం మండలంలోని చౌటిపల్లె జడ్పీహైస్కూల్ వద్ద విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు.గతంలో ఈయనపై అవినీతి, లైంగిక ఆరోపణలు ఉన్నాయని వెంటనే మంత్రి లోకేశ్ స్పందించి ఆయనను తొలగించాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఓంకార్,విద్యార్థులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ రాష్ట్ర తరగతులు జయప్రదం చేయండి

జమ్మలమడుగు, జూలై 24: డీవైఎఫ్ఐ రాష్ట్ర తరగతులు జయప్రదం చేయాలని ని డీవైఎఫ్ఐ జమ్మలమడుగు పట్టణ సహాయ కార్యదర్శి మహేష్‌యాదవ్, ఉపాధ్యక్షుడు సుబహాన్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ ఈనెల 27, 28, 29, 30 తేదీలలో నంద్యాలలో జరిగే డీవైఎఫ్ఐ రాష్ట్ర స్థాయి నాయకత్వ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని తెలిపారు. ఈ మేరకు జమ్మలమడుగులో ఐటీఐ కళాశాల వద్ద రాష్ట్ర శిక్షణ తరగతుల కరపత్రాలను విడుదల చేశారు.

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని అభివృద్ధి చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 24: పట్టణంలో ఉన్న జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని అభివృద్ధి చేయాలని ఎస్వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.హరినారాయణ పేర్కొన్నారు. బుధవారం విజయవాడలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను కలిసి ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ప్రజలకు అందుబాటులో ఉందని, అయితే వైద్యుల కొరత ఉందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వి.శశిభూషణ్‌రెడ్డి, ప్రొద్దుటూరు అసెంబ్లీ కో-కన్వీనర్ గౌరీశంకర్, భానుప్రకాశ్ పాల్గొన్నారు.



మంత్రి సత్యకుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

నియోజకవర్గ సమస్యలను పరిష్కరించండి

మైదుకూరు రూరల్ జూలై 24 : మైదుకూరు నియోజవకర్గంలోని పలు సమస్యలను బుధవారం అసెంబ్లీ సమావేశాలలోని ఖాళీ సమయంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ,డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో చర్చించారు.నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పవన్ దృష్టికి తీసుకెళ్లారు.అందుకు పవన్ కళ్యాణ్ సానుకూలంగా స్పందించినట్లు పుట్టా ఫోన్ ద్వారా తెలిపారు.



పవన్‌కళ్యాణ్‌తో చర్చిస్తున్న పుట్టా

చంద్రబాబుకు సమస్యలను వివరించిన రాజశేఖర్

బద్వేలు, జూలై24: ముఖ్యమంత్రి చంద్రబాబును బద్వేలు టీడీపీ నాయకుడు డాక్టర్ ఓబుళాపురం రాజశేఖర్ ఆయన సచివాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం బద్వేలు నియోజకవర్గంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్లు రాజశేఖర్ తెలిపారు. ఇందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.



ఉచిత అంబులెన్స్ ప్రారంభం

ప్రొద్దుటూరు టౌన్, జూలై 24: జమా అతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్స్‌ను టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి వీఎస్ ముక్తియార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమా అతే ఇస్లామి హింద్ సంస్థ అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జమా అతే ఇస్లామి హింద్ జిల్లా అధ్యక్షుడు హుస్సేన్ అహ్మద్, ఎన్.ఎస్.మొహిద్దీన్, షఫీవుల్లా, షరీఫ్, రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.



ఉచిత అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న వీఎస్ ముక్తియార్

ఫ్రీహోల్డ్ భూరిజిస్ట్రేషన్ వెంటనే రద్దుచేయాలి

పోరుమామిళ్ల, జూలై 24 : గత ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్ విధానం రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వీరయ్య డిమాండ్ చేశారు. బుధవారం అంబేడ్కర్ భవన్‌లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేలు రెవెన్యూ డివిజను పరిధిలోని బి.కోడూరు మున్నెల్లి పంచాయతీలోని గోవిందాయపల్లెలో 40 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది తమ ఇష్టానుసారంగా ఆన్‌లైన్ చేస్తూ ఉన్న విధానంలో రెవెన్యూ కార్యాలయ సిబ్బందికే అధికారులు జిల్లా పరిషత్ పాఠశాల స్థలాన్ని అక్రమ పద్ధతిలో ఇతరులకు కట్టబెట్టడం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల భూమిని రెవెన్యూ అధికారులు సిబ్బంది తమ సొంత హక్కుగా భావించి వారి పేర్లపై సదరు భూమిని ఆన్‌లైన్ చేయడం ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ విషయంపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు ప్రవీణ్‌కుమార్, సుదర్శన్, నగిలి గురయ్య పాల్గొన్నారు.

'కెమికల్ ఫ్యాక్టరీని మూసేయాలి'

ముద్దనూరు జూలై24: జీఎం ఎకో కెమికల్ ఫ్యాక్టరీ వల్ల నీరు, గాలి కలుషితమవుతోందని,పండ్లతోటలతో సహా ఇతర పంటలు మాడిపోతున్నాయని,ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ఆ ఫ్యాక్టరీ మూతవేయాలని పెద్దదుద్యాల గ్రామ ప్రజలు బుధవారం ఫ్యాక్టరీ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు.అందులో భాగంగా పెద్దదుద్యాల గ్రామానికి చెందిన సాంబశివారెడ్డి మాట్లాడుతూ మండల పరిధి పెద్దదుద్యాల గ్రామ సమీపంలో 2019 జూలై నెలలో ఫ్యాక్టరీ ప్రారంభించారు. అంతకు ముందు గ్రామంలో ఫ్యాక్టరీ వల్ల ఎటువంటి నష్టం జరుగదని, గ్రామ అభివృద్ధితోపాటు ఉద్యోగవకాశాలు లభిస్తాయని యాజమాన్యం తెలిపిందన్నారు.ఫ్యాక్టరీ వల్ల గ్రామానికి ఎటువంటి అభివృద్ధి ,ఉద్యోగవకాశాలు జరగకపోవడమే కాకుండా పూర్తిగా నష్టం జరుగుతోందన్నారు.ఫ్యాక్టరీలో కెమికల్ వ్యర్థాలను భూమిలోకి పంపిస్తున్నారని,కెమికల్ దుర్వాసన దాదాపు 10 కిలో మీటర్ల మేర వ్యాపిస్తోందన్నారు. దీంతో గాలి, నీరు కలుషితమవుతోందన్నారు.జీవాలు, పశువులు అనారోగ్యానికి గురై మృతి చెందడమేకాకుండా గర్భదారణలోనే దూడలు మృతి చెందుతున్నాయన్నారు.వ్యవసాయ బోర్లలో నీరు కలుషితవడం వల్ల పంటలు,చెట్లు మాడిపోతున్నాయన్నారు.కలుషిత నీటి వల్ల ప్రజలు ఆరోగ్య పరమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు.ఇంత ప్రమాదకరమైన ఫ్యాక్టరీ అని తమకు తెలియదన్నారు.గ్రామ ప్రజలమంతా కెమికల్ ఫ్యాక్టరీ మూసివేయాలని గతంలో ఎన్నోసార్లు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు.ఫ్యాక్టరీ మూతవేసేంత వరకు నిరంతర నిరసన కార్యక్రమం కొనసాగిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, నాగేశ్వరరెడ్డి, మల్లేష్, నాగిరెడ్డి, రాజేశ్వరరెడ్డి, సీతారామయ్య, ఓబులేసు, నాగలింగారెడ్డి, వరదరాజులు, బ్రహ్మనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న పెద్దదుద్యాల గ్రామస్థులు

సమస్యను పైఅధికారుల దృష్టికి తీసుకెళతాం:సువర్ణాదేవి, తహసీల్దారు

ఫ్యాక్టరీ వద్ద పరిస్థితులు పరిశీలించాం.ఫ్యాక్టరీ సిబ్బందితో మాట్లాడాం.ప్రజల అభిప్రాయాలను తీసుకున్నాం. సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళతాం.